ప్రజాశక్తి

సోమవారం 15 జులై 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

సమస్యల తిష్ట

కొండకు ఆనుకుని నిర్మించిన గృహాలు

- చోడపల్లి జగనన్న కాలనీలో పేదలకు అవస్థలు
- వానొస్తే ఇంట్లోకి వరద నీరు
- రోడ్లు, కాలువల్లేక దోమల బెడద
- ఇళ్లకు ఆనుకుని విద్యుత్ వైర్లు
- కూటమి ప్రభుత్వం స్పందించేనా ?

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, అచ్యుతాపురం విలేకరి

గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన జగనన్న కాలనీల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. అసౌకర్యాల మధ్యే లబ్ధిదారులు కాలం గడుపుతున్నారు. జిల్లాలోని అచ్యుతాపురం మండలం చోడపల్లి కొండ కింద భాగంలో ఉన్న జగనన్న కాలనీలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఇక్కడ మోసయ్యపేట, రామన్నపాలెం, చోడపల్లికి చెందిన దాదాపు 290 మందికి చోడపల్లి కొండ కింద భాగంలో వేసిన లే అవుట్‌లో గత ప్రభుత్వం ఇళ్ల పట్టాలు, ఇళ్లు మంజూరుచేసింది. వారిలో 90 మంది పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించకపోవడంతో స్థలాలు అప్పగించాలని వారు నాలుగేళ్లుగా తిరుగుతున్నారు. ఇళ్ల స్థలంలేక వీరు బాధపడుతుండగా జగనన్న కాలనీలో రహదారులు, కాలువలు, వీధిలైట్లు వంటి సౌకర్యాల్లేక ఇళ్లు కట్టుకున్న పేదలు రోజూ అవస్థలు పడుతున్నారు.

కొండ కింది భాగంలో లే అవుట్ వేయడంతో పెద్ద వర్షాలు పడితే కాలనీలోని ఇళ్లల్లోకి వర్షపు నీరు వచ్చి చేరుతోంది. ఇళ్లు కోతకు గురవుతున్నాయి. కొండ పైభాగం నుంచి వచ్చే వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరకుండా మళ్లించే పని ప్రభుత్వం చేయలేదు. రహదారులు ఏర్పాటుచేయలేదు. వీధిలైట్లు వేయలేదు. దీంతో అక్కడివారు రాత్రిపూట బయటకు రావాలన్నా, ఇళ్లకు వెళ్లాలన్నా భయపడుతున్నారు. 'ఇళ్లు ఇచ్చినా సుఖంలేదు. కొండనీరు వరదలా ఇళ్లలోకి వచ్చిపడుతోంది. ఇళ్లులేక తప్పక ఇక్కడకొచ్చాం. ఈ కష్టాలు పగవాళ్లకు కూడా రాకూడదు'.అని మరపురెడ్డి కనకతార వాపోయారు. ఇంటి నిర్మాణం పూర్తయినా ప్రభుత్వం నుంచి రూ.80 వేలు బిల్లు ఆమెకు రాలేదు. ఇంటి నిర్మాణ విలువ రూ.1.80 లక్షల్లో ప్రభుత్వం లక్ష రూపాయలు ఇచ్చినట్లు ఆమె తెలిపింది. కాలువల్లేక ఇంటిముందే వాడుకనీరు నిల్వ ఉండపోవడంతో దోమలు చేరి ఇబ్బందులు పడుతున్నామని పోలారపు లావణ్య ఆవేదన వ్యక్తంచేశారు. విద్యుత్ వైర్లు ఇళ్లకు ఆనుకొని వేయడంతో ఏ క్షణంలో ఎవరికి ఏం జరుగుతుందోనని భయమేస్తోందని కాలనీవాసులు తెలిపారు. లావణ్యకు ఇంటి బిల్లు రూ.60 వేలు రావాల్సివుంది. కర్రి ప్రభావతికి రూ.80 వేలు రావాల్సివుంది. జగనన్న కాలనీలో రహదారులు, కాలువలు, వీధిలైట్ల సౌకర్యం కల్పించడంతో పాటు కొండ నుంచి వర్షపునీరు ఇళ్లల్లోకి రాకుండా చూడాలని కాలనీ వాసులంతా కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లు

దుర్గాప్రసాదరావును సత్కరిస్తున్న మానవ హక్కుల కౌన్సిల్ సభ్యులు

దాడులు, అత్యాచారాల నివారణకు చర్యలు

హైకోర్టు న్యాయమూర్తి దుర్గాప్రసాదరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులు, ఆత్యాచారాల నివారణకు మరిన్ని చర్యలు చేపట్టాల్సి ఉందని, ఆ దిశగా మానవ హక్కుల కౌన్సిల్ సభ్యులు ప్రజలకు గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలని ఎపి హైకోర్టు న్యాయమూర్తి యు.దుర్గాప్రసాదరావు అన్నారు. చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపైన ఫిర్యాదు చేసేందుకు అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విశాఖ మానవ హక్కుల కౌన్సిల్ రజతోత్సవ వేడుకలు ఆదివారం ఓ హోటల్లో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గడిచిన 25 ఏళ్లుగా కౌన్సిల్ ప్రజలకు విస్తృత సేవలందించడం ప్రశంసనీయమని కొనియాడారు. ఆర్థికంగా బలహీనపడిన, ఎటువంటి ఆసరా లేని మహిళలను లక్ష్యంగా చేసుకొని కొంతమంది దాడులు చేస్తున్నారన్నారు. మహిళల అక్రమ రవాణా, పైశాచికత్వానికి పాల్పడుతున్నారని తెలిపారు. ఈ విషయంలో జాగురుకతతో వ్యవహరించాలని కోరారు. చట్టాలు, రాజ్యాంగం పట్ల అవగాహన కలిగి ఉండేందుకు ప్రత్యేకంగా టోల్‌ఫ్రీ నెంబర్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. మానవ అక్రమ నివారణపై దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం తొలి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.సత్యనారాయణ మాట్లాడుతూ 1999లో మానవ హక్కుల కౌన్సిల్ స్థాపన జరిగిందన్నారు. త్వరలోనే కౌన్సిల్ ఆధ్వర్యంలో వాలంటీర్లను మిగతా 2లో..

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయండి

▶ వార్త మెయిన్‌లో...

వైజాగ్ వారియర్స్‌కు రూ.10 లక్షల నజరానా

▶ వార్త 2లో..

జిపిఎస్ జీవో 54 ప్రతుల దగ్ధం

▶ వార్త 5లో..

పోలీసు సిబ్బందికి సూచనలు చేస్తున్న సిపి శంఖబ్రత బాగ్చి

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం ఉదయం వన్ టౌన్ లా అండ్ ఆర్డర్, క్రైమ్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లను ఆయన అకస్మాత్తుగా సందర్శించారు. స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సిబ్బంది ఫిర్యాదుదారులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అన్ని రిజిస్టర్లు ఎల్లవేళలా అప్డేట్‌గా మిగతా 2లో..

22 వసతి గృహాల్లో ఆధునికీకరణ పనులు పూర్తి

మెనూ పక్కాగా అమలు

- 'ప్రజాశక్తి'తో విశాఖ జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రామారావు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రూ.496 లక్షలతో జిల్లాలోని 22 వసతి గృహాల్లో ఆధునికీకరణ పనులు పూర్తి చేసినట్టు విశాఖ జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రామారావు తెలిపారు. దీంతో అవి సుందరంగా తయారయ్యాయన్నారు. హాస్టళ్లలో మెనూను పక్కాగా అమలు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన పలు విషయాలు వెల్లడించారు. ఈ వివరాలు ఆయన మాటల్లోనే..

ప్రస్తుతం వసతి గృహాల పరిస్థితేంటి ?

విశాఖ జిల్లాలో సాంఘిక సంక్షేమ హాస్టళ్లు (ప్రీ, పోస్ట్ మెట్రిక్) అత్యంత సుందరంగా మారాయి. 22 హాస్టల్స్‌లో ఇప్పటికే రూ.496 లక్షలతో ఆధునికీకరణ పనులు పూర్తయ్యాయి. వసతి గృహాల రిపేర్లు, రంగులతో ప్రస్తుతం అవి ఆకట్టుకుంటున్నాయి. గడిచిన ఐదేళ్లలో ఒక్క ఏడాదికి రూ.1.36 కోట్ల బడ్జెట్ దాదాపుగా విశాఖ జిల్లాలోని 22 హాస్టళ్లకు వచ్చింది. ప్రీ మెట్రిక్ పిల్లలకు వారంలో 3 సార్లు చికెన్, 4 దఫాలు గుడ్లు మెనూ పక్కాగా అమలైంది. నెలకు ఒక పిల్లవాడిపై హాస్టల్‌లో రూ.1450, పోస్ట్ మెట్రిక్ పిల్లాడిపై రూ.1600ను ప్రభుత్వం ఖర్చుచేయడంతో 'వసతి గృహాల్లో భోజనం భళా'

అనిపించేలా తయారైంది.

మెనూ, పౌష్టికాహారం వివరాలు తెలియజేస్తారా ?

జిల్లాలో ప్రీ మెట్రిక్ హాస్టళ్లు అంటే 6 నుంచి 10వ తరగతి వరకూ 8 ఉండగా దీంట్లో 1100 సీట్లు ఉన్నాయి. పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్ 10వ తరగతి తర్వాత తరగతులకు సంబంధించినవి 14 మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

దాడులు, అత్యాచారాల నివారణకు చర్యలు

తయారు చేసి వారి ఆధ్వర్యంలో గ్రామ స్థాయి నుంచి విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మానహ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంత్రి శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ పదేళ్ల నుంచి పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా సుమారు ఆరు వేల ఫిర్యాదులను జాతీయ మానవ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. కార్యక్రమంలో మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర అధ్యక్షులు జగన్‌మోహన్‌రావు, ఎయు డాక్టర్ అంబేద్కర్ లా కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీతామాణిక్యం, విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షులు బెవరా సత్యనారాయణ, మాజీ జిల్లా న్యాయమూర్తి, పోలీస్ కంప్లైంట్ అథారిటీ చైర్మన్ వరప్రసాదరావు, హ్యూమన్ రైట్ కౌన్సిల్ కార్యవర్గ సభ్యులు ఎస్‌వి.రమణ, తెలంగాణ అధ్యక్షురాలు సుభాషిణి, సామాజిక విశ్లేషకులు సన్ మూర్తి, వివిధ జిల్లాల కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మానవ హక్కుల అవగాహనపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు.

ఆధునికీకరణ పనులు పూర్తి

ఉన్నాయి. వీటిలో 1400 సీట్లు ఉన్నాయి. అడ్మిషన్ల ప్రక్రియ సాగింది. హాస్టళ్లలో ఉండే పిల్లలకు పౌష్టికాహారం పక్కాగా అమలు చేస్తున్నాం. గతంలో ప్రతి రోజూ పాలు, అల్పాహారంగా పూరీలు, పులిహోర, ఇడ్లీ, జీలకర్ర అన్నం, బన్సీరవ్వ ఉప్మా, పెసరపప్పు పొంగలి, ఆ తర్వాత మిడ్‌మార్నింగ్ స్నాక్స్‌గా ప్రతిరోజూ వేరుశనగ చెక్కి ఇచ్చేవారం. సాయంత్రం ఆల్పాహారంగా సేమియా పాయసం, ఉడికించిన బఠానీ గుగ్గిల్లు, రాగిలడ్డు, ఉడికించిన అలసందు గుగ్గిళ్లు, మరమరాలు మిక్చర్, రవ్వకేశరి అందజేసేవాళ్లం. ఇవన్నీ రోజుకో వెరైటీ చొప్పున గతంలో అమలయ్యాయి. మధ్యాహ్నం, రాత్రి మంచి భోజనం ఎలాగూ ఉంటుంది. అయితే, కొత్త ప్రభుత్వంలో మెనూలో భాగంగా కొన్ని ప్రాధాన్యతలు మారే అవకాశం ఉంది.

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి

ఉండాలన్నారు. సిబ్బందికి కుటుంబ పరంగా, ఉద్యోగపరంగా, ఇతర ఏ సమస్యలు ఉన్నా తాము ఇచ్చిన 7995095799 నెంబరుకు తెలియజేయాలన్నారు. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. వారి సమస్యలను సావదానంగా వినాలని, తగు విచారణ చేసి త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. క్రైమ్ పోలీస్ స్టేషన్ ఆవరణలోగల సీజ్ చేయబడిన, వినియోగంలో లేని వాహనాలు పాడవకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. స్టేషన్‌లో పలు విభాగాలలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది విధి నిర్వహణా తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సిపి స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ రద్దీ ఉన్న పూర్ణా మార్కెట్ వంటి ప్రాంతాలపై ఎక్కువ దృష్టి సారించాలన్నారు. బ్లూకోట్స్, ట్రాకోట్స్ పని తీరు పరిశీలించారు. ట్రాఫిక్ అవగాహనా కార్యక్రమాలు నిత్యం చేపట్టాలని తెలిపారు, రోడ్డు ప్రమాదాల తగ్గుముఖానికి తీసుకోవలసిన చర్యలపై చర్చించి, తగు ఆదేశాలు జారీచేశారు. ఫిషింగ్ హార్బర్, పోర్టు ప్రాంతాల్లో దొంగతనాలు, అసాంఘిక చర్యలు జరగకుండా క్రైమ్ పోలీసులు చర్యలు చేపట్టాలన్నారు. సిసి కెమెరాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్స్ కదలికలపై నిఘా ఉంచాలన్నారు. విధులలో ఎటువంటి అధికార దుర్వినియోగానికి పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎమ్మెల్యేలకు సత్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన, యాదవ సామాజిక తరగతికి చెందిన ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్‌లను ఆదివారం సాయంత్రం సిరిపురంలోని గురజాడ కళా క్షేత్రంలో విశాఖపట్నం జిల్లా యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా మాజీ శాసన సభ స్పీకర్, టిడిపి నాయకులు యనమల రామకృష్ణుడు హాజరయ్యారు. ఎన్‌టిఆర్ హయాంలో సేవా దృక్పథం ఉన్నవారికి ప్రాధాన్యత ఉండేదని, నేడు డబ్బున్న వారు మాత్రమే రాజకీయాల్లో రాణించగలుగుతున్నారని తెలిపారు. బలహీనవర్గాల వారు రాజకీయాలకు దూరమవుతున్నారన్నారు. ప్రజాస్వామ్యంలో బలహీన వర్గాలకు చట్టసభలలో ప్రాధాన్యం ఉండాలని తెలిపారు. విశాఖపట్నం జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఒమ్మి సన్యాసిరావు అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ రాజాన రమణి, మాజీ ఎమ్మెల్యే పిన్నింటి వరలక్ష్మి, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, బరిణికాన రామారావు, మొల్లి లక్ష్మణరావు, బమ్మిడి రమణ, మంచి రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

వాక్‌థాన్‌లో పాల్గొన్న అధికారులు

బీచ్ రోడ్డులో స్వచ్ఛతా వాక్‌థాన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హెచ్‌పిసిఎల్ ఎల్‌పిజి మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా పఖ్వాడా-2024 కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం బీచ్ రోడ్డులో వాక్‌థాన్ నిర్వహించారు. హెచ్‌పిసిఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (స్పెషల్ ప్రాజెక్ట్స్) ఎన్.బాలదండయుతపాణి, డిజిఎం సేల్స్ సి.మురళీకృష్ణ, డిజిఎం రీజియన్ ప్రత్తి శ్రీనివాస్ నేతృత్వంలో ఈ కార్యక్రమం సాగింది. సుమారు 250 మందితో ఆర్‌కె బీచ్ కాళీమాత దేవాలయం వద్ద స్వచ్ఛతా సమావేశం నిర్వహించారు. అనంతరం బీచ్ క్లీనింగ్ చేపట్టారు.

వైజాగ్ వారియర్స్‌కు రూ.10 లక్షల నజరానా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రా ప్రీమియర్ లీగ్ - 2024లో వైజాగ్ వారియర్స్ ఛాంపియన్స్ టైటిల్‌ను కైవశం చేసుకున్న నేపథ్యంలో ఆ జట్టుకు రూ.10 లక్షల నజరానా లభించింది. విశాఖపట్నంలోని ఎసిఎ-విడిసిఎ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్‌లో వైజాగ్ వారియర్స్ ఉత్తరాంధ్ర లైయన్స్‌తో తలపడి అద్భుత విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో వైజాగ్ వారియర్స్ సహ-యజమాని, లైఫ్‌స్పాన్ యజమాని అయిన డాక్టర్ నరేంద్ర రామ్ జట్టుకు రూ.10 లక్షల నగదు బహుమతిని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైజాగ్ వారియర్స్ జట్టు సభ్యులకు, క్రీడా సిబ్బందికి, మీడియాకు, స్పాన్సర్లకు అభినందనలు తెలిపారు.

విజేతగా నిలిచిన వైజాగ్ వారియర్స్ చరిత్ర సృష్టించిందని ఫ్రాంచైజీ యజమాని, పల్సస్ సిఇఒ డాక్టర్ గేదెల శ్రీనుబాబు సంతోషం వ్యక్తం చేశారు. తమ జట్టు ఆటగాళ్లు అద్భుత ప్రతిభతో రాణించారన్నారు. జాతీయ, అంతర్జాతీయ మ్యాచులు ఆడిన అనుభవం ఉన్న స్థానిక క్రికెటర్లు కెఎస్.భరత్, అశ్విని హెబ్బార్ వైజాగ్ వారియర్స్ విజయంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు.

జట్టుతో వైజాగ్ వారియర్స్ యజమానులు

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాదని ప్రధాని ప్రకటించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాదని, ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతుందని ప్రధాని మోడీ స్పష్టంగా ప్రకటించాలని టిఎన్‌టియుసి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కుప్పిలి రామకృష్ణ కోరారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని కోరుతూ విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలేదీక్షలు ఆదివారానికి 1205వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో టిఎన్‌టియుసి నాయకులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయవద్దని కోరుతూ మూడు సంవత్సరాలకుపైగా ఉద్యమం సాగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. పైగా కర్మాగారాన్ని బలహీనపరిచే చర్యలు చేపట్టిందని ఆవేదన వెలుబుచ్చారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలన్నారు. దీక్షల్లో కురాయి నాగార్జున, పివి.రమణ, పడాల పైడిబాబు, నంబాల సత్యనారాయణ, పెద్దాడ పైడిరాజు, ఇప్పిలి అప్పారావు, మధు పాల్గొన్నారు.

దీక్షలో కూర్చున్న టిఎన్‌టియుసి నాయకులు

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై అమర్‌కు చిత్తశుద్ధి కరువు

ప్రజాశక్తి - ఎంవిపి. కాలనీ : ఉత్తరాంధ్ర అభివృద్ధిపై మాజీ మంత్రి అమర్‌నాథ్‌కు చిత్తశుద్ధి లేదని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ అన్నారు. నారా చంద్రబాబునాయుడు ఉత్తరాంధ్రపై సవతి ప్రేమ చూపిస్తున్నారని అమర్ వ్యాఖ్యానించడం దారుణమన్నారు. బివి.రామ్ ఎంవిపి కాలనీలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఆదివారం కలిసి పలు విషయాలు చర్చించారు. వైసిపి హయాంలో ఉత్తరాంధ్ర ప్రాంతానికి చేసిన అభివృద్ధి ఏంటో చర్చించేందుకు ప్రెస్‌క్లబ్‌కు రమ్మని సవాల్ విసిరినప్పటికీ అమర్ రాలేదన్నారు. త్వరలోనే అమర్ వ్యాఖ్యలపై కేసు పెడతామన్నారు. కార్యక్రమంలో కొయ్య రామకృష్ణ, వి.వినోద్, లాడి కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దళిత మహిళ హత్య కారకులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కర్నూలు జిల్లా ఆదోని మండలం నాగనాధనహళ్లి గ్రామంలో దళిత మహిళను ట్రాక్టర్‌తో తొక్కించి హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సుబ్బన్న, టి.చిరంజీవి డిమాండ్ చేశారు. ఆదివారం మధురవాడలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ దళితులను ఏం చేసినా అడిగే వారు ఉండరనే అహంభావంతోనే హంతకులు కిరాతకంగా ఇలా ట్రాక్టర్‌తో తొక్కి చంపేశారన్నారు. ఈ అమానుష చర్యను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ఇటువంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. దళితులకు రక్షణ కల్పించాలని కోరారు.

IN THE HON'BLE COURT OF XII ADDL. DISTRICT JUDGE AT VISAKHAPATNAM
O.S.264/2015

Between:
Gudimetla Ramachandra Reddy ...Plaintiff
And
Baddi Gunamani and 4 others ...Defendants

SUMMONS

To
D-2: Baddi Manjusri,
D/o. B.Venkata Ramana,
Hindu, Aged about 35 years,
R/at D.No.58-10-22,
New Karasa, Marripalem,
Visakhapatnam.
D-5: The Matrusree Co-op. House Building Society,
Regd. No.B.1751, Rep. by its
Secretary, Main Office
located at Spring Road,
Visakhapatnam.

Please take summons that the above named Plaintiff has instituted the above suit against the Defendants for declaration of his title over the schedule property and for other reliefs and the same stands posted to **19-07-2024** for your (D2 and D5) appearance on that day at **10:30 AM.** You should appear before the aforesaid Hon'ble Court either in person or through an Advocate without fail,else the matter will be determined in your absence, exparte.

(By Order of the Hon'ble Court)
N. SESHU KUMAR, Advocate
Visakhapatnam, Cell: 9347379739.

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM
O.S.82/2023

Between:
Gorle Krishna ....Plaintiff
And:
Gorle Suryanarayana and another...Defendants

NOTICE

Defendants 1 & 2:
D1: Gorle Suryanarayana, S/o.late Sanyasi @ Sanyasi Naidu, Hindu, aged about 83 years, Bheemali Village, Lakkavarapukota Mandal, Vizianagaram District.
D2: Gorle Ravi Babu @ Ravi kumar, S/o. Suryanarayana, Hindu, aged 43 years, Sri Sai Nilayam, Opposite Sarada Mahila Samajam, Harbor Park, Visakhapatnam-530003.

Please take notice the above plaintiff filed the above suit against you for cancellation of Regd., Partition Deed, dt.21.089.2007 bearing Document No:3574/2007 and consequentially directing the Sub-Registrar, Kothavalasa to make a note for cancellation of the said document and for passing of the Preliminary decree and directing the partition of the schedule property into 3 equal shares and to allot one such share to the plaintiff and the above suit is posted to 29.07.2024 for your appearance before the above Honourable court at 10:30 AM either personally or through an Advocate duly authorized by you. If you fails to appear before the above court on **29.07.2024 at 10:30 A.M.** the matter will be decided in your absence as per the records available on record.

K.B.PARAMESWARA RAO
Advocate for Plaintiff Vizianagaram
Cell: 9440738336

IN THE HONOURABLE COURT OF THE 2nd ADDITIONAL JUNIOR CIVIL JUDGE (MOBILE) VIZIANAGARAM
O.S.287/2020 and 167/2020

Between:
Pandyala John Nellson and another ......Plaitiff
And:
Bunga Surya Rao and 2 others ......Defendant

TO: -
D3/R3 : Dabbiru Rama Gopal, S/o Rama Krishna, R/o Plot No. 21, Sector-8, Ushodaya Junction, Visakhapatnam.

పై నెంబరు పర్మనెంట్ ఇంజక్షన్ మంజూరు కోసం మీపై దావాను వాది దాఖలు చేసుకున్నారు. మీకు నోటీసు అందజేసేందుకు ప్రత్యామ్నాయంగా పేపరు పబ్లికేషన్ ద్వారా **తే 26-7-2024ది ఉదయం 10-30 గం॥**లకు వాయిదా అయిఉన్నది. కావున మీరుగాని, మీ తరపు లాయరు ద్వారా గాని కోర్టుకి హాజరై మీకున్న ఆక్షేపణలను తెలియజేయవలెను. లేనిచో మీపై పరోక్షంగా వున్న ఆధారాల మేరకు తీర్మానం జరుగుతుందని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

P.DHANANJAYA RAO
B.ESWARA RAO
Advocates, Vizianagaram,
Cell: 9440711430

ఇళ్ల నిర్మాణాల్లో అనిశ్చితి!

జగన్నాథపురంలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు

- ప్రభుత్వాలతోపాటు మారుతున్న ప్రాధాన్యతలు
- గందరగోళంలో హౌసింగ్ లబ్ధిదారులు
- బిల్లులు చెల్లింపుపైనా అనుమానం,అయోమయం
- ఆందోళన వద్దంటున్న హౌసింగ్ అధికారులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరుచేసిన ఇళ్లనిర్మాణాల పురోగతిపై అనిశ్చతి నెలకొంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఇప్పటివరకు ఉన్న ప్రభుత్వం మారిపోగా, కొత్తపాలకులు అధికారంలోకి రావడంతో అర్ధాంతర నిర్మాణాలు, వాటి బిల్లుల చెల్లింపు పరిస్థితి ఏంటనే గందరగోళ పరిస్థితి ఉంది. దీంతో ముందుకు వెళ్లలేక, అక్కడితో ఆగిపోలేక లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. మారిన ప్రభుత్వాల ప్రాధాన్యతలూ లబ్ధిదారుల ఆవేదనకు కారణమనే అభిప్రాయం వ్యక్తమౌతోంది.

మండలంలోనూ, జివిఎంసి నాలుగో వార్డు పరిధిలోని ఐదు విలీన పంచాయతీల్లోనూ మొత్తంగా అందరికీ ఇళ్లు పథకం కింద 2021 డిసెంబర్ లో 2075మందికి ఇళ్ళు మంజూరయ్యాయి. ఇళ్లు మంజూరు చేసిన కొత్తలో అధికారులు, నేతలు హడావిడి చేసి, వాటిని ప్రారంభింపజేయడం, ముందుకురాని లబ్ధిదారులపై నిర్మాణాలు చేపట్టేలా ఒత్తిడి చేయడం పరిపాటికాగా, ఆ తర్వాత కొన్నాళ్లకు బిల్లులు చెల్లింపులు, ఇతర సమస్యలు వచ్చేసరికి లబ్ధిదారులను ఎవరూ పట్టించుకోని పరిస్థితి ఉంటుంది. ఈ లెక్కన మంజూరైన ఇళ్లల్లో ఉత్సాహం, అవసరం ఉన్న లబ్ధిదారుల్లో 884మంది తమ ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసుకోగా, మరో 50 ఇళ్లు స్లాబ్ దశలో ఉండగా, 181 ఇళ్లు స్లాబ్ ఎత్తులోనూ,.36 లెంటిల్ దశలో, 565 పునాదుల దశలో, 349 పునాదుల గోతుల దశలో ఉన్నాయి. పదిమంది లబ్ధిదారులు ఇంకా ప్రారంభించని స్థితి ఉంది.

ఒక్కో ఇంటి నిర్మాణానికి గత ప్రభుత్వం రూ 1.80 లక్షలు మంజూరు చేసింది. ఇందులోనే రూరల్‌లో లబ్ధిదారులకు 90 సిమెంట్ బస్తాలు, 485 కిలోల ఐరన్ ప్రభుత్వమే ఇస్తుంది. పావలా వడ్డీకి డ్వాక్రా సంఘాలకు రూ 35 వేలు సాయం అందజేసింది. పట్టణ పరిధిలో లబ్ధిదారులకు 400 కిలోల ఐరన్, 70 సిమెంట్ బస్తాలు ప్రభుత్వమే ఇచ్చింది.20 టన్నుల ఇసుక ఉచితంగానే ఇచ్చారు.

ఇక పిఎం ఆవాస యోజన (బిఎల్‌సి హౌసింగ్ స్కీమ్) కింద అమనాంలో 66 ఇళ్లు మంజూరుకాగా 40 పూర్తయ్యాయి అన్నవరంలో 60 కి 24 ఇళ్లు, చిప్పాడలో 254కి 79 ఇళ్లు, దాకమర్రిలో 248 కి 98, లక్ష్మీపురంలో 23కి 18, మజ్జిపేటలో 73కి 55, మజ్జివలసలో 41కి 37, మూలకుద్దు, రేఖవానిపాలెం పంచాయతీల్లో 190కి 67, పెదనాగమయ్యపాలెంలో 20కి9, సింగనబందలో 73 కి 37, టి నగరపాలెంలో 14 కి 10, ఆర్ తాళ్ళ వలసలో 10కి 8, తాటితూరు పంచాయితీలో 58 ఇళ్లకు 14పూర్తయ్యాయి. ఇక జిఎంవిసి నాల్గో వార్డు చేపలుప్పాడలో 276 కి 130, జెవి అగ్రహారంలో 151 కి43;, కె నగరపాలెంలో 221 కి113, కాపులుప్పాడలో 168కి92 , నిడిగట్టులో 127కి 50 ఇళ్లు పూర్తయ్యాయి. అలాగే జివిఎంసి 1,2,3 వార్డుల్లో 9,584 ఇళ్లు మంజూరు కాగా, 526 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి 702 ఇళ్ళ నిర్మాణం ప్రారంభం కానే లేదు మార్కింగ్ దశలో 2,616, గుంతలదశలో 372, ప్లింత్ బీమ్ దశలో 1190, బేస్‌మెంట్ దశలో 2011, లింటల్ దశలో 106, రూఫ్ దశలో 989 , స్లాబ్ దశలో1072 ఇళు ఉన్నాయి.సంబంధితలబ్ధిదారులకు ఆనందపురం మండలం దబ్బంద, మామిడిలోవ, రామవరం, ఎన్ జి ఆర్ పురం, గండిగుండం, గొట్టిపల్లి, చందక, జగన్నాథపురం, బాకూరుపాలెం, విజయరాంపురం, పద్మనాభం మండలం మద్ది, తునివలస రెడ్డిపల్లి గ్రామాల్లో లేఔట్లు వేసి ఇళ్ళ స్థలాలు కేటాయించి, ఇళ్లు మంజూరు చేశారు.

నిర్మాణాల జాప్యానికి కారణాలు అనేకం

ఇళ్ళ నిర్మాణంలో జాప్యానికి అనేక కారణాలుండగా, ప్రారంభ దశలో ఇసుక లభ్యతలేకపోవడంప్రధాన కారణంగా లబ్ధిదారులు చెబుతున్నారు.ఇంటి నిర్మాణానికి అవసరమైన నీరు అందుబాటులో లేక పోవడం మరో కారణం.ఇక రేఖవానిపాలెం, ఆర్ తాళ్ళవలస, తాటితూరు, మజ్జివలస, లక్ష్మీపురం తదితర గ్రామాల లబ్ధిదారులకు అందుబాటులో కాకుండా, సుదూరంగా ఉన్న ఆనందపురం మండలం మచ్చవానిపాలెం, పద్మనాభం మండలం సామయ్య వలస, భీమిలి రూరల్ మండలం బోడమెట్ట పాలెం గ్రామాల్లో ఇళ్ల స్థలాలు కేటాయించడం కూడా వారు నిర్మాణంపై నిరాసక్తత చూపడానికి ఇంకో కారణంగా చెప్పొచ్చు జివిఎంసి 1,2,3వార్డుల లబ్ధిదారులకు ఆనందపురం, పద్మనాభం మండలాల్లో గ్రామాల్లో ఇళ్ళ స్థలాలు కేటాయించడంతో వారు అక్కడకు వెళ్లేందుకు సుముఖత చూపలేదు.

గడువులోగా ఇళ్ల నిర్మాణాల పూర్తి

గడువులోగా ఇళ్ళ నిర్మాణం పూర్తి చేస్తామని భీమిలి మండల హౌసింగ్ ఎఇఇ ఎం హుస్సేన్, అర్బన్ ఎఇఇ , దువ్వు శేషుబాబు ప్రజాశక్తికి తెలిపారు. లబ్ధి దారులు ఎటువంటి ఆందోళన చేందనక్కర లేదన్నారు.

పోలీసుల కార్డన్ సెర్చ్

కార్డెన్ సెర్చ్ తనిఖీలలో పాల్గొన్న పోలీసులు

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 96వ వార్డు జెఎన్‌ఎన్‌ఆర్‌ఎం కాలనీలో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి పెందుర్తి, గోపాలపట్నం పోలీస్‌స్టేషన్లకు చెందిన ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహిచారు. ఈ సందర్భంగా నార్త్ జోన్ ఎసిపి అన్నెపు నరసింహమూర్తి మాట్లాడుతూ ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పోలీస్ సిబ్బంది పరిశీలించారని, ఇళ్లల్లో సరైన ఆధారాలు లేని వారి వద్ద వివరాలను సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులకు చెందిన అన్ని వాహనాలకు సంబంధించి రికార్డులు, ఇతర పత్రాలను పరిశీలించారు. ఇటీవల కాలంలో నగరంలో గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాల వినియోగం, అమ్మకం ఎక్కువైన నేపథ్యంలో దానిపైనే ప్రత్యేక నిఘా పెట్టి తనిఖీలు చేపట్లారు. యువత తప్పుదోవ పట్టకుండా, ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను, నైపుణ్యాభివృద్ధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌ను చక్కదిద్దుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిఐ రామకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

అప్పన్నను దర్శించిన ఐఎఎస్ అధికారి

ప్రజాశక్తి-సింహాచలం : సింహాద్రి అప్పన్న ఆదివారం ఐఎఎస్ అధికారి నారాయణ స్వరూప్ దర్శించుకున్నారు వీరికి ఆలయ కార్య నిర్వహణాఅధికారి శ్రీనివాస్ మూర్తి సాదర స్వాగతం పలికారు. ఆయనకప్ప స్తంభాన్ని ఆలింగం చేసుకొని బేడా మండపం చుట్టూ ప్రదక్షిణం చేసి స్వామి అంతరాలయంలోనూ గోదాదేవి సన్నిధిలోని గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించగా, స్వామి ప్రసాదం, చిత్రపటాన్ని ఆలయ అధికారులు అందించి సత్కరించారు .

పాఠశాల క్రీడా మైదానంలో మొక్కలు నాటివేత

ప్రజాశక్తి -ఆనందపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా మైదానంలో చుట్టూ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆదివారం స్వచ్ఛందంగా మొక్కలు నాటారు. అనందపురం గ్రామానికి చెందిన దాత కొట్టాడ సత్యమూర్తి ఆర్థిక సహాయంతో సమకూర్చిన వేప, బాదం తదితర మొక్కలను క్రీడా మైదానం చుట్టూ అంచుల్లో నాటారు. నాటిన మొక్కలను ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధతో సంరక్షించుకోవాలని నిర్ణయించారు.కాగా ఆనందపురం ఉన్నతపాఠశాల క్రీడా మైదానంలో నిత్యం అనేకమంది విద్యార్థులు, యువకులు, వృద్ధులు, మహిళలు వాకింగ్, జాగింగ్‌తోపాటు ఇతర వ్యాయామాలు చేసేందుకు వస్తుంటారు. కొండవాలు ప్రాంతం కావడంతో వర్షం కురిసినప్పటికీ ఏమాత్రం నీరు నిల్వ ఉండకుండా అన్నింటికీ అనువుగా ఉంటుంది. క్రీడామైదానం అభివృద్ధికి ఇన్‌ఛార్జి హెచ్‌ఎం కెవిఆర్ పట్నాయక్, ఉపాధ్యాయులు ముత్యాలనాయుడు, భాస్కరరావు, సత్యనారాయణ,రాజు మహేష్ తదితర ఉపాధ్యాయుల సహకారంతో వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రసాదరావు విశేషంగా కృషి చేస్తున్నారు కార్యక్రమంలో త్రినాథ్ రావు, భాస్కరరావు సత్యనారాయణ, రాజు ఉమా మహేష్ పాల్గొన్నారు

అ'పూర్వ' కలయిక

2007-08 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని గొట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007-08 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం రేవిడిరిసార్ట్స్ వేదికగా జరిగింది. 16ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులంతా గత జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ సంతోషంగా గడిపారు.

తమలో ఎవరికి ఏ కష్టం వచ్చినా ఒకరికొకరు చేదోడువాదోడుగా ఉండాలని, ఇకనుంచి క్రమం తప్పకుండా తామంతా కలుద్దామని నిర్ణయించారు. రోజంతా ఉల్లాసంగా గడిపిన వారంతా ఆత్మీయంగా వీడ్కోలు చెప్పుకుని సహాయంగా ఉంటామని, ఈ స్నేహ సంబంధం ఇలానే కొనసాగాలని కోరుకుంటూ భారంగా వీడ్కోలు చెప్పుకుని వెనుదిరిగారు.

మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉదయశంకర్

ప్రజాశక్తి - ఆనందపురం : మానవ హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆనందపురం మండలం, లోడగలవానిపాలెం గ్రామ పంచాయతీకి చెందిన మామిడి ఉదయ్‌శంకర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఉదయశంకర్‌ను నియమిస్తూ, ఆంధ్ర రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పబ్లిక్ రిలేషన్ విభాగానికి సంస్థ జాతీయ అధ్యక్షులు షేక్ సిరాజుద్దీన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఉదయశంకర్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్‌లో స్థానం కల్పించడంపై ఆనందం వ్యక్తం చేశారు. కౌన్సిల్ జాతీయ ఛైర్మన్ షేక్ సిరాజుద్దీన్, సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. తనకు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తానని తెలిపారు.

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సిపి

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌ను సిప శంకబ్రత బాగ్చీ ఆదివారం సందర్శించారు. ఆరిలోవ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎక్కువ నేరాలు, విచ్చలవిడి గంజాయి వాడకం వంటి ఘటనల నేపథ్యంలో పరిశీలించారు. ముడసర్లోవ పరిశర ప్రాంతాలు, హెల్త్‌సిటీ, శ్మశానవాటికలు వంటి నిర్మానుష్య ప్రదేశాలను పరిశీలించిన సిపి, ఇటువంటి ప్రదేశాలలో నిఘా పెంచాలని పోలీసులను ఆదేశించారు.

నేరాలు ఘోరాలు

ఆటో డ్రైవర్ అదృశ్యం

బేరి నాగశేషుబాబు(ఫైల్)

ప్రజాశక్తి- ఆనందపురం: మండలంలో నెలతేరు గ్రామం కస్తూర్బా విద్యాలయ సమీపంలో ఇందిరా గాంధీ కాలనీలో నివాసం ఉంటున్న బేరి నాగశేషుబాబు (42) ఆటోడ్రైవర్ ఈనెల 11న గురువారం మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదని అతని భార్య మణి ఆదివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆటోడ్రైవర్‌గా భార్య మణి, ఒక పాప ,బాబు ఇలా చిన్నకుటుంబంతో జీవనం సాగిస్తున్న నాగశేషుబాబు, ఈనెల 11 గురువారం మధ్యాహ్నం భోజనం చేసి, ఇంటివద్దే ఆటో వదిలేసి బయటికి వెళ్లాడని, అప్పటినుండి తిరిగి ఇంటికి రాలేదని భార్య మణి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. బంధువులు, మిత్రుల ఇళ్ల వద్ద వాకబు చేసినప్పటికీ, ఎటువంటి ఆచూకీ దొరకలేదని, ఫిర్యాదులో పేర్కొంది.ఆర్థిక ఇబ్బందులు వల్లే తన భర్త శేషుబాబు ఇంటి నుండి బయటకు వెళ్ళిపోయి ఉంటాడని భార్య మణి ఆవేదన వ్యక్తం చేస్తోంది. కాగా ఆచూకీ డ్రైవర్ నాగశేషుబాబు ఆచూకీ తెలిసిన వారు 94901 79714 మొబైల్ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని వేడుకుంటోంది. అందిన ఫిర్యాదుపై ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిట్టీల పేరుతో మోసం

ప్రజాశక్తి - ఆరిలోవ : చిట్టీల పేరుతో ఓ మహిళ స్థానికులకు టోకరా వేసింది. పాడిన చిట్టీలను తిరిగి చెల్లించక పోవడంతో బాధితులు ఆదివారం ఆమె ఇంటిని ముట్టడించారు. డబ్బులు ఇవ్వాలని గొడవ చేయడంతో ఇల్లు మాత్రమే తన వద్ద ఉందని, దానిని అమ్ముకొని పంచుకోండని తేల్చి చెప్పింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆరిలోవ కాలనీ, లక్ష్మీనగర్‌కు చెందిన అయితి వెంకటలక్ష్మీ కొన్నేళ్లుగా చిట్టీలు నిర్వహిస్తుంది. చీటీలుపాడుకున్న వారికి సొమ్ములు చెల్లించకపోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం 120 మంది నుంచి రూ 3 కోట్లు వరకు చిట్టీల సొమ్ము చెల్లించాలిస ఉందని బాధితులు అంటున్నారు. మూడు నెలల క్రితమే ఆరిలోవ పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా, రెండు నెలల్లో ఎవరి డబ్బులు వారికి చెల్లించేందుకు వెంకట లక్ష్మీ ఒప్పుకుంది. అయితే గడువుదాటినాడబ్బులు ఇవ్వక పోవడంతో ఆదివారం వెంకట లక్ష్మీ ఇంటిని బాధితులు ముట్టడించారు. సమాచారం తెలుసుకున్న ఆరిలోవ పోలీసులు అక్కడకు చేరుకొని ఆందోళనకు దిగకుండా వారించారు. ఫిర్యాదుచేస్తే తగిన న్యాయం జరుగుతుందని బాధితులకు నచ్చజెప్పడంతో వారంతా వెంకటలక్ష్మిపై ఫిర్యాదు చేశారు.

18 నుంచి జనసేన సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి -మధురవాడ : భీమిలి నియోజకవర్గం పరిధిలో జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు విజయవంతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సందీప్ పంచకర్ల పేర్కొన్నారు. ఆదివారం ఎండాడలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 28 వరకు సభ్యత్వ నమోదు చేపట్టాలని అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారన్నారు. మూడు నెలల కిందటే పార్టీ క్రియాశీలక సభ్యత్వ గడువు ముగిసినప్పటికీ,. ఎన్నికల ప్రక్రియ మధ్యలో పార్టీ శ్రేణులను ఈ కార్యక్రమంతో గందరగోళపరచకూడదనే ఉద్దేశంతో మూడు నెలలపాటు వర్తించేలా క్రియాశీలక సభ్యుల రెన్యువల్ రుసుమును పవన్ కల్యాణే చెల్లించారన్నారు. ఇపుడు జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదుపై పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా విధివిధానాలను తెలియజేశారన్నారు. సభ్యత్వ నమోదు ప్రణాళికాబద్ధంగా చేపట్టి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బివి. కృష్ణయ్య, శాఖరి శ్రీనుబాబు, వార్డు అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాదాలకు దూరంగా ఉండండి

ప్రజాశక్తి-సీతమ్మధార : రౌడీషీటర్లుగా నమోదైన వారంతా వివాదాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో తమ పనులు చేసుకోవాలని నాలుగో పట్టణ సీఐ ఎస్ విజయకుమార్ సూచించారు. ఆదివారం స్టేషన్ ఆవరణలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ కౌన్సిలింగ్ నిర్వహించారు ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ తగాదాలు, సెటిల్‌మెంట్లు వంటి అనవసర వివాదాల్లో తలదూర్చి, సమస్యలను కొని తెచ్చుకోవద్దని రౌడీషీటర్లకు సూచించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

ప్రజాశక్తి- పెందుర్తి : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రజాసమస్యలను పరిష్కరించి, అవసరమైన సౌకర్యాలను కల్పిస్తానని స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. ఆదివారం జివిఎంసి 97వ వార్డు సుజాతనగర్, వెంకటాద్రి నగర్, టీచర్స్ లేఔట్, సంపత్ వినాయక నగర్, వీరనగర్, భాస్కర్ రెడ్డి లేఔట్ తదితర ప్రాంతాల్లో జివిఎంసి అధికారులు, సిబ్బందితో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ ఇచ్చిన మాటమేరకు ఆయా కాలనీలో పర్యటించి, కాలువలు, డ్రైనేజీలు, గెడ్డలతో ఇబ్బందులు వంటి సమస్యలను అధికారులతో కలిసి నేరుగా పరిశీలించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ మేరకు సంబంధిత అధికారులకు తగు ఆదేశాలిచ్చారు.కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వసంత శంకరరావు, 97వ వార్డు జనసేన అధ్యక్షులు సేనాపతి సోమశేఖర్, జనసేన నాయకులు లక్ష్మీ, రమేష్, వార్డు కూటమి నేతలు పాల్గొన్నారు.

ముగిసిన అధ్యాపకుల శిక్షణ

ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న రామారావు

ప్రజాశక్తి -గాజువాక :ఐసిటి టెక్నిక్ ద్వారా విద్యార్థులకు పాఠాలు సులభంగా బోధించవచ్చని ఎంవిఆర్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ వి.రామారావు అన్నారు. మూడు రోజులుగా ఎంవిఆర్ కళాశాలలో నిర్వహిస్తున్న కళాశాల అధ్యాపకుల శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యా విధానంలో వస్తున్న మార్పులు, నూతన ఒరవడులకు అనుగుణంగా అధ్యాపకులు అప్‌డేట్ కావాలన్నారు. దానికి. ఇలాంటి శిక్షణా తరగతులు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కె.శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపల్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ కృజూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఈశ్వరరాజు పాల్గొన్నారు.

హిందీ విద్యార్థులకు సర్టిఫికెట్లు

సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు వీరే

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో 9 రకాల హిందీపరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఆదివారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. హిందీ పరిచయ్, ప్రాథమిక, మధ్యమ, రాష్ట్ర భాష ప్రవేశిక, రాష్ట్ర భాషా విశారద పూర్వార్ధ, రాష్ట్ర భాషా విశారద ఉత్తరార్ధ, రాష్ట్ర భాషా ప్రవీణ పూర్వార్ధ, రాష్ట్ర భాషా ప్రవీణ ఉత్తరార్ధ ఉత్తీర్ణులైన వారికి మార్కుల జాబితాలు, సర్టిఫికెట్లను అందజేశారు ఆదర్శ హిందీ ప్రేమీ మండలి వ్యవస్థాపక అధ్యక్షులు కెఎస్ఆర్ కృష్ణారావు అధ్యక్షతన భీమిలిలో జరిగిన సమావేశంలో, గౌరవాధ్యక్షులు గంటా నూకరాజు పాల్గొని, సర్టిఫికెట్లను అందజేశారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై స్పష్టతనివ్వాలి

● ముఖ్యమంత్రి చంద్రబాబు తీరుపై ఉక్కు కార్మికుల అసంతృప్తి

దీక్షల్లో కూర్చున్న కార్మిక నేతలు, కార్మికులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టతనివ్వాలని కార్మిక సంఘ నేతలు డి.ఆదినారాయణ, ఎస్.రామారావు, యు.రామస్వామి, కెఎస్ఎన్.పిట్టారెడ్డి తదితరులు డిమాండ్ చేశారు. కూర్మన్నపాలెం జంక్షన్‌లో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో 1249వ రోజు దీక్ష శిబిరంలో స్టీల్ వైఎస్ఆర్‌టియుసి నేతలు పాల్గొన్నారు. ఈసందర్భంగా నేతలు మాట్లాడుతూ, ఇటీవల స్టీల్‌ప్లాంట్ సందర్శన వచ్చిన కేంద్ర ఉక్కుమంత్రి కుమారస్వామి, విశాఖ స్టీల్‌ప్లాంట్ మూసేయబోమని ప్రకటించారే తప్ప, ప్రయివేటీకరించబోమని స్పష్టత ఇవ్వలేదన్నారు. ఇక మెడ్‌టెక్ జోన్ సందర్శనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసేందుకు ఉక్కు కార్మికసంఘాల నేతలు వెళితే, కనీసం వారికి అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం దారుణమని అసంతృప్తి వ్యక్తం చేశారు.విశాఖ ఉక్కుపై గందరగోళ ప్రకటనలు కాకుండా, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిపై స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో మార్డుపూడి పరదేశి, కర్రి దళినాయుడు, నల్లమిల్లి శ్రీనివాస్‌రెడ్డి, బి రామకృష్ణ, దాసరి పుల్లారావు పిట్ట సంజీవ్‌రెడ్డి, ఎస్ భాస్కర్‌రాజు, గుమ్మడి నరేంద్ర కుమార్, బొజ్జ వెంకట్ రమణ, గొందేశి మంగరాజు, గెద్దాడ అప్పలకొండ, పి ఉగ్రం, బి రాజన్ రాజు, కాండ్రేగుల శ్రీను, వాసునాయుడు, కె శివ రామకృష్ణ పాల్గొన్నారు

బాధితులకు నేటికీ అందని పూర్తి పరిహారం

● ఎల్‌జి పాలిమర్స్ గ్యాస్‌లీకేజీ బాధితుల ఆత్మీయ సమావేశం

ఎల్‌జి పాలిమర్స్ బాధితుల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-వేపగుంట :ఎల్‌జి పాలిమర్స్ గ్యాస్ లీకేజీ ఘటన జరిగి ఏళ్లు గడుస్తున్నా నేటికీ అనేకమంది బాధితులకు ప్రభుత్వపరంగా ఆదుకునే చర్యలు చేపట్టలేదని బాధితసంఘం నేతలు ఆవేదన వ్యక్తం చేశారు.ఆదివారం జివిఎంసి 94వ వార్డులోనిఒక ప్రైవేట్ కల్యాణ మండపంలో ఎల్‌జి పాలిమర్స్ గ్యాస్‌లీకేజీ బాధితుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 93వ వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా మాట్లాడుతూ, ఎల్‌జి పాలిమర్స్‌లో నష్టపోయిన బాధితుల్లో నేటికీ అనేకమందికి నేటికీ పరిహారంగానీ, ఇతర ఆదుకునే చర్యలు చేపట్టలేదన్నారు. సమస్యలన్నింటినీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, ఆదుకోవాలని కోరనున్నట్లు తెలిపారు. ఎల్‌జి పాలిమర్స్ వద్ద రూ.120కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం సంకల్పించినట్లు వెలువడుతున్న వార్తలపై స్పష్టత కోరాలన్నారు. బాధితులు నాగరాజు మాట్లాడుతూ గ్యాస్‌లీకేజీలో బాధితుడినైనన తనకు ఎటువంటి పరిహారంగానీ, సాయంగానీ ఇవ్వలేదన్నారు. తనలాగే మిగిలిన బాధితులకు పరిహారంతోపాటు హెల్త్‌కార్డులు మంజూరు, ఇతర ప్రయోజనాలను చేకూర్చాలని కోరారు. మరోమారు ఎమ్మెల్యేకు సమస్యను విన్నవించి, న్యాయం చేయాలని కోరనున్నారు.సమావేశంలో అధిక సంఖ్యలో బాధితులు పాల్గొన్నారు

'ఉక్కు' పరిరక్షణ పోరాటంలో భాగస్వాములమౌదాం

హార్బర్ అండ్ పోర్టు పెన్షనర్ల అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో నేతల స్పష్టీకరణ

సమావేశంలో మాట్లాడుతున్న చౌదరి అప్పారావు

ప్రజాశక్తి- మాధవధార: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటంలోనూ తామంతా భాగస్వాములై ఒకరోజు ఆందోళన, నిరసన చేపడతామని హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో నిర్ణయించారు. ఆదివారం కళింగనగర్ సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షులు చౌదరి అప్పారావు మాట్లాడుతూ విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటుపరం కానివ్వకుండా పింఛనుదారులందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడుదామన్నారు. ఈ సందర్భంగా పోర్టు పెన్షనర్లకు ఫొటో గుర్తింపుకార్డులు ఇవ్వాలని, అందరికీ మెరుగైన వైద్యసౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పి శివప్రకాశరావు, అన్నెపు నారాయణరావు, రెహమాన్, సుబ్బారావు పాల్గొన్నారు.

సమన్వయ కమిటీ ఏర్పాటు

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నేత మూర్తి

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డులో పలు ప్రజాసంఘాలతో నూతనంగా సమన్వయ కమిటీ ఏర్పాటు చేశారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలోజోన్ కార్యదర్శి ఎస్ అప్పలనాయుడు పాల్గొన్నారు. కమిటీ సభ్యులుగా టి ఆదిలక్ష్మి, కె సుశీల, చిన్ని, కె విమల, స్వాతి, పిసూర్య నారాయణ, డి.బాబాజీ, జోగ వెంకటరావులను నియమించారు. సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా ఎం సూర్య కుమారిని నియమించారు. వార్డు పరిధిలో కమిటీ సభ్యులచే పలు సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు మూర్తి, అప్పలనాయుడు తెలిపారు.

రక్తదాన శిబిరం విజయవంతం

రక్తదానం చేస్తున్న దాతలు

ప్రజాశక్తి-సింహాచలం : నవ యువ సేవా సంఘం ఆధ్వర్యంలో రోటరీ బ్లడ్‌బ్యాంకు, వందే భారత్ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో రక్తదాన చైతన్యకర్త వినోద్, బాలు, అశోక్ వారి సిబ్బంది పర్యవేక్షణలో స్థానిక ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో మహా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 230 మంది దాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. జనసేన భీమిలి ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్ , పి మౌర్య సింహా, 98 వ వార్డు కార్పొరేటర్ పివి.నరసింహం, జివిఎంసి కోఆప్షన్ సభ్యులు బెహరా భాస్కరరావు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు గంట్ల శ్రీనుబాబు,పాసర్ల ప్రసాద్, బిసి సెల్ రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కర్రి అప్పలస్వామి 98వ వార్డు వైసిపి అధ్యక్షులు కొలుసు ఈశ్వరరావు, నేతలు కరి సత్తిబాబు 98వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పంచదార్ల శ్రీనివాస్ 98వ వార్డు జనసేన అధ్యక్షులు మజ్జి సూరిబాబు, కాపు సంఘం నేత నవీన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- సీతమ్మధార: సీతంపేట ప్రధాన రహదారిలోని దుర్గ గణపతి ఆలయంలో చేపడుతున్న నిర్మాణ పనులను ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఆదివారం శంకుస్థాపన చేశారు. స్థానిక వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవింద ఆధ్వర్యంలో రూ. రెండు లక్షలతో స్టోర్ రూమ్ నిర్మాణ పనులు చేపట్టనుండగా ఆయా పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టిడిపి, బిజెపి, జనసేన నాయకులు కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

మొల్ల రామాయణ పరిమళ వ్యాఖ్య గ్రంథావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

ప్రజాశక్తి- సీతమ్మధార :విశాఖ సాహితి ఆధ్వర్యంలో ఆచార్య కోలవెన్ను మలయవాసిని రచించి, తిరుమల తిరుపతి దేవస్థానం ముద్రించిన మొల్ల రామాయణ పరిమళ వ్యాఖ్య అనే గ్రంథాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ ఈదర పెదవీర్రాజు లలితా పీఠంలో జరిగిన కార్యక్రమంలోఆయన మాట్లాడుతూ, తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడిన ఎందరో కవులలో రచయిత్రి మొల్ల ఒకరిని, ఒక మహిళ అయి కూడా ఆనాటి పురుషాధిక్య సమాజంలో రామాయణాన్ని రచించడంచాలా సాహసోపేతమైన చర్య అన్నారు.

గ్రంథ రచయిత ఆచార్య కోలవెన్ను మలయవాసిని మాట్లాడుతూ మహిళలలో మొట్టమొదటి రచయిత్రిగా మొల్ల రామాయణాన్ని చాలా సంక్షిప్తంగా, సరళంగా రచించారని, అటువంటి గ్రంథానికి వ్యాఖ్యాన గ్రంథం ఉండాలన్న సంకల్పంతోనే ఈ రచనకు పూనుకున్నానని తెలిపారు.తన గ్రంథాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం ముద్రించడంపై సంతోషం వ్యక్తం చేశారు.విశాఖ సాహితీ ఉపాధ్యక్షురాలు డాక్టర్ కందాళ కనకమహాలక్ష్మి అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ఆచార్య వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి, ప్రముఖ రచయిత డాక్టర్ డి.వి. సూర్యారావు పాల్గొని గ్రంథ సమీక్ష చేశారు.కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి శంకర్ నీలు భాగవతుల సభ్యులు గండికోట విశ్వనాథం, అన్నవరపు శ్రీనివాసరావు, సాయిబాల, ఏ.వి. జోగారావు, చప్పా సూర్యనారాయణ, పలువురు సాహితీ ప్రియులు పాల్గొన్నారు

జిపిఎస్ జీవో 54 ప్రతుల దగ్ధం

గెజిట్ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని యుటిఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల అభిప్రాయానికి భిన్నంగా గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్) అమలుకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వత్సవాయి శ్రీలక్ష్మి, గొంది చినబ్బాయ్ డిమాండ్ చేశారు. దీనికి సంబంధించిన జిఒ 54 ప్రతులను యుటిఎఫ్ ఆధ్వర్యాన స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు ఆదివారం దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఏళ్ల తరబడి ఉద్యోగ, ఉపాధ్యాయులు పోరాటాలు సాగిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికలకు ముందు ప్రస్తుత ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి లోకేష్ కూటమి అధికారంలోకి వస్తే సిపిఎస్ స్థానంలో జిపిఎస్ కంటే మెరుగైన విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అది నమ్మిన ఉద్యోగ ఉపాధ్యాయుల ఆశలను వమ్ము చేస్తూ, వైసిపి ప్రభుత్వం రూపొందించిన జిపిఎస్ విధానాన్ని చంద్రబాబు ప్రభుత్వం చట్టబద్దం చేస్తూ, పాత తేదీలతో గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం అన్యాయమన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపి కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పోషించిన పాత్రను నెలలోపే కూటమి ప్రభుత్వం మర్చిపోయినట్లు ఉందన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలను అమలు చేయాలని చూస్తే పోరాటాలకు సన్నద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎల్లయ్యబాబు, ఎంవి.అప్పారావు, జిల్లా కార్యదర్శి శేషబాబు, కోశాధికారి జోగా రాజేష్, సీనియర్ నాయకులు జికెఆర్ స్వామి, అలివేలు, రాజునాయుడు, దేముడు నాయుడు, బండారు శంకర్, సలీం, రవి, మున్సిపల్ ఉపాధ్యాయుల నాయకులు సతీష్, మోడల్ స్కూల్ నాయకులు ఆశాలత, ఏపీసిపిఎస్ఇఎ నాయకులు ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జిఒ 54 గెజిట్ నోటిఫికేషన్ ప్రతులను దగ్ధం చేస్తున్న యుటిఎఫ్ నేతలు, టీచర్లు

జిపిఎస్ గెజిట్‌ను ఉపసంహరించుకోవాలి : ఎపిటిఎఫ్

బుచ్చయ్యపేట : సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ ఇస్తామని అధికారంలోకి గత వైసిపి ప్రభుత్వం మోసపూరితంగా జిపిఎస్ చట్టం చేసి ఉపాధ్యాయుల ఆగ్రహానికి గురైందని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కెకెవిఎస్.ధర్మారావు, ఎస్.దుర్గాప్రసాద్ తెలిపారు. ఆదివారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల విషయంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని జిపియస్ గెజిట్‌ని ఉపసంహరించుకోవాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు.

తవ్వేసిన రోడ్డును పరిశీలిస్తున్న వైసిపి నేత రవికుమార్

రైతుల రహదారిని ధ్వంసం చేయడం అన్యాయం

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని నారపాడు పంచాయతీ బలిజిపాలెం గ్రామంలో సర్వే నెంబర్ 161, 162ల్లోని ప్రభుత్వ గెడ్డవాగులో సుమారుగా 100 మంది గ్రామ రైతులు పొలంలోకి వెళ్లి రావడానికి నిర్మించుకున్న ఆ మట్టి రహదారిని కొందరు వ్యక్తులు జెసిబితో ధ్వంసం చేయడం అన్యాయమని వైసిపి పెందుర్తి నియోజకవర్గ నేత గండి రవికుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు న్యాయం చేయాలి తప్ప ఇలాంటి అమాయక ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం దారుణమన్నారు. వెంటనే రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి గ్రామస్థాయిలో ఇలాంటి కార్యక్రమాలను అడ్డుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రహదారి సమస్య పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు వనం అచ్చంనాయుడు, కాపుశెట్టి శేషుబాబు, యడ్ల నాయుడు, ఐడి బాబు, మామిడి కొండాజీ, దుర్గారావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

నేత్ర పరీక్షలు చేస్తున్న శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి నిపుణులు

450 మందికి నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

బ్రాండిక్స్ ఆధ్వర్యంలో ఆ కంపెనీ ఆవరణలో ఆదివారం నిర్వహించిన 129వ ఉచిత కంటి వైద్య శిబిరంలో 450 మంది కంటి రోగులను శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్యులు పరీక్షించారు. శిబిరానికి 700 మంది రోగులు హాజరయ్యారు. రోగులను పరీక్షించి 229 మందికి ఉచితంగా అద్దాలను అందించారు. 110 మందికి మందులు ఐ డ్రాప్స్ పంపిణీ చేశారు. 50 మంది రోగులకు కేటరాక్ట్ సర్జరీ చేయించుకోవాలని సూచించారు. శిబిరానికి వచ్చిన రోగులకు మజ్జిగ, ఫలహారం, భోజనం సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బ్రాండిక్స్ ఇండియా పార్టనర్ దొరస్వామి మాట్లాడుతూ బ్రాండిక్స్ ఇండియా ముఖ్యమైన సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆరుద్ర పురుగులను రక్షించుకుందాం

ప్రజాశక్తి-అనకాపల్లి

ఆరుద్ర పురుగులను రక్షించుకొని జీవ వైవిధ్యాన్ని కాపాడాలని కోరుతూ ఆదివారం గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీ, గ్రీన్ క్లబ్ సభ్యులతో ప్రదర్శన నిర్వహించారు. గ్రీన్ క్లబ్, అన్నమాచార్య వాగ్గేయ వరదాయని సంయుక్త ఆధ్వర్యంలో అనకాపల్లి మండలం బట్లపూడి గ్రామంలో సోహం స్వచ్ఛంద సంస్థ ఆవరణలో వివిధ రకాల పండ్ల మొక్కలు, ఔషధ మొక్కలను నాటారు. సందర్భంగా గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్ మాస్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ఆరుద్ర పురుగులు కనిపించడాన్ని రాబోయే వర్షానికి సూచికగా భావిస్తారని, వీటిని రైతు మిత్రులుగా, జీవ సంబంధ నియంత్రణకారులుగా పరిగణిస్తారని పేర్కొన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో ఆరుద్ర పురుగులు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. నేడు రసాయనక మందులు పురుగుమందులు కారణంగా వీటి మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. విశ్రాంత అటవీశాఖ రేంజర్ బి వినోద్ కుమార్ మాట్లాడుతూ వాతావరణ మార్పులు ప్రస్తుతం మానవాళిని బెంబేలెత్తిస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో అన్నమాచార్య వాగ్గేయ వరదాయని వ్యవస్థాపకులు తిమ్మాపాత్రుని చక్రవర్తి, ఎస్ఎఫ్ఐ సత్యనారాయణ, మల్ల లోకేష్, బేతాళ శేష సాయి, ఉమామహేశ్వరరావు, సూరి అప్పారావు, సోహం వ్యవస్థాపకులు కాండ్రేగుల రవికుమార్ పాల్గొన్నారు.

ప్రదర్శన చేస్తున్న గ్రీన్‌క్లబ్ సభ్యులు

16న దేవాలయ భూముల కౌలుకు వేలం పాట

ప్రజాశక్తి -వడ్డాది

మండలంలోని వడ్డాదిలో నీలకంఠేశ్వర స్వామి, మల్లికార్జున స్వామి వారి ఆలయాల సంబంధించిన భూముల కౌలుకు ఈ నెల 16న వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఈఓ శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నీలకంఠేశ్వర స్వామికి చెందిన సర్వే నెంబరు 20-10లో 20సెంట్లు, 27-10లో 1.25 ఎకరాలకు, మల్లికార్జున స్వామికి చెందిన సర్వే నెంబరు 37-17లో 2.22 ఎకరాలు మూడేళ్ల పాటు సాగు చేసుకునేందుకు వేలంపాట నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు పెద్ద బజారు వీధిలోని సంబంధిత దేవాలయం వద్ద వేలం నిర్వహిస్తామని, ఆసక్తి కలిగిన వారు రూ.5000 ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

అక్రమ గ్రావెల్ క్వారీలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- పరవాడ

పరవాడ మండలంలో గత నాలుగేళ్ల నుండి వైసిపి నాయకుల అండదండలతో నడుస్తున్న అక్రమ గ్రావెల్ క్వారీలపై తక్షణమే రెవెన్యూ, గనుల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లా కార్యదర్శి బుగిడి రామగోవిందరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పెదముషిడివాడ, ఈ.బోనంగి, పరవాడ రెవెన్యూ పరిధిల్లో ఉన్న గ్రావెల్ క్వారీల్లో జరుగుతున్న అవినీతిని అధికారులు అరికట్టాలని కోరారు. కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు కొల్లగొట్టి వైసిపి నాయకులు చేసిన దందా ప్రజలు గమనించినట్లు పేర్కొన్నారు. తాడి రెవెన్యూ పరిధిలో అన్ని అనుమతులతో గ్రావెల్ క్వారీ నిర్వహిస్తున్న యజమాని జనసేన పార్టీ నాయకుడు కావడంతో వైసీపీ నాయకులు బురద జల్లడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. పరవాడ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న క్వారీలో మైనింగ్ బిల్లులు లేకుండా గత ఐదు సంవత్సరాల నుండి చేస్తున్న అక్రమ గ్రావెల్ దందాపై తక్షణమే విచారణ చేపట్టాలని కోరారు.

ఎమ్మెల్యే విజయ్ కుమార్‌కు సన్మానం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మండలంలోని మడుతూరు గ్రామంలో ఆదివారం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్‌ను జనసేన పార్టీ జిల్లా మహిళా కార్యదర్శి మోటూరు శ్రీవేణి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా మడుతూరు జంక్షన్ నుంచి గ్రామ వరకు వందలాది బైకులతో స్వాగత ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే దృష్టికి గ్రామ సమస్యలను త్రివేణి తదితరులు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాన్ని ప్రత్యేకంగా అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామని, వేసవిలో మంచినీటి సమస్య తలెత్తుతుందని చర్యలు చేపడతామని చెప్పారు. నిరుద్యోగ యువతీ యువకులకు ఎస్ఇజెడ్ పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు, జనసేన పార్టీ నాయకులు బి.రాందాస్, టెక్కలి పరశురాము, పైలా రామనాయుడు, ఉపాధ్యాయ సంఘ ప్రతినిధి ఎం త్రినాథ్ స్వామి, రాజాన సన్యాసినాయుడు, నాలుగు మండలాల నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

వర్షాల్లేక రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి-కె.కోటపాడు

తగినంతగా వర్షాలు కురవకపోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. వరి విత్తనాలు వేసి సుమారు 20 రోజులు దాటుతున్న వర్షాలు కురిసే పరిస్థితులు కానరాకపోవడంతో ఈ ఏడాది వరి నాట్లు పూర్తవుతాయనే నమ్మకం కోల్పోతున్నారు. ఇప్పటివరకు చెదురుమెదురు వర్షాలు కురవడం తప్ప పూర్తిస్థాయిలో వర్షాలు కురిసి చెరువులు నిండిన పరిస్థితి లేదు. రైవాడ జలాశయ పరిధిలోని కొన్ని గ్రామాలకు తప్ప మిగిలిన గ్రామాలన్నీ వర్షాధారం పైనే వ్యవసాయం కొనసాగుతున్నాయి. దీంతో వర్షాలు కురిసి చెరువులు నిండితేనే ఈ ఏడాది వరి నాట్లు పూర్తవుతాయని, ఎప్పుడు వర్షాలు కురుస్తాయోనని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

వర్షాలు లేక తడి ఆరిపోయిన వరి నారు

మాట్లాడుతున్న రక్తదాన ప్రచారకర్త వినోద్ బాబు

రక్తదానంపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి- వడ్డాది

అమ్మ హెల్పింగ్ హార్ట్స్ ఆధ్వర్యంలో 2024 అక్టోబర్ 2న బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్న నేపథ్యంలో ఆదివారం వడ్డాదిలో రక్తదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర రక్తదాన ప్రచారకర్త, వందే భారత్ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ వినోద్ బాలు మాట్లాడుతూ రక్త దానం సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. రక్తదానం చేయడం వలన ఆరోగ్యం మరింత మెరుగుపడుతుందని, అనేక వ్యాధులకు దూరంగా ఉండవచ్చని చెప్పారు. రెండేళ్ళ క్రితం వడ్డాదిలో నిర్వహించిన శిబిరంలో 567 యూనిట్లు సేకరించామని గుర్తు చేశారు. ఈ దఫా 1000 యూనిట్ల రక్తం సేకరించమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. తద్వారా లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించవచ్చని తెలిపారు. వైసీపీ టౌన్ అధ్యక్షుడు దొండా నారాయణమూర్తి మాట్లాడుతూ అమ్మ హెల్పింగ్ హార్ట్స్ చేస్తున్న నిస్వార్థ సేవను అభినందించారు. తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగిరిశెట్టి శ్రీరామమూర్తి మాట్లాడుతూ సంస్థకు భవన నిర్మాణానికి ప్రభుత్వం స్థలాన్ని ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక యువకులు పాల్గొన్నారు.

మన్యంలో ఏకధాటిగా వర్షాలు

ప్రజాశక్తి- దుంబ్రిగుడ

మండలంలో గత రెండు రోజులు గా ఏకధాటిగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకదాటిగా వర్షాలు కురవడంతో మండలంలోని గిరిజనులు బయటకి రాలేని పరిస్థితి ఏర్పడింది.మండలంలోని సంపంగిపెడ్డ, చంపాపట్టి, చాపరాయి, గోరాపూర్, కురిడి గెడ్డల ఉధృతితో రాకపోకలు నిలిచిపోయాయి. చాపరాయి జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది.జాతీయ రహదారి చిత్తడిగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

పెదబయలు : పెదబయలులో ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తుండటంతో స్థానికులు ఇళ్ల నుండి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. పెదబయలు గ్రంథాలయం ఇళ్ల ముందర వర్షపు నీరు చేరి చెరువును తలపిస్తోంది. డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని పలుమార్లు విన్నవించినా సంబంధిత అధికారులు కనీస స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేసారు. అధికారులు డ్రెయినేజీ మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు,

ఘనంగా రామచంద్రమ్మ అమ్మవారి పండగ

ప్రజాశక్తి - యలమంచిలి

యలమంచిలి మున్సిపాలిటీ నాల్గవ వార్డులో జనసేన పార్టీ కార్యకర్త తుమ్మపాల సూరిబాబు ఆధ్వర్యంలో రామచంద్రమ్మ అమ్మవారి పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతలు ఉమ్మడి ఆస్తి అని, దాన్ని అందరూ సమిష్టిగా కాపాడుకోవాలని సూచించారు. స్థానిక నేతలతో అమ్మవారిని దర్శించుకొని రాంబిల్లిలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన పట్టణ అధ్యక్షులు గొర్లె నానాజీ, బొద్దపు శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

18, 19 తేదీల్లో ఎఎంఎఎల్ కాలేజీకి నాక్ కమిటీ రాక

- పలు అంశాలపై పరిశీలన
- పూర్వ విద్యార్థుల సంఘంతో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు భేటీ

ప్రజాశక్తి- అనకాపల్లి

స్థానిక అనకాపల్లి మర్చంట్స్ అసోసియేషన్ లింగమూర్తి (ఎఎంఎఎల్) కళాశాలను జాతీయస్థాయి నాక్ అక్రిడిటేషన్ కమిటీ ఈ నెల 18, 19 తేదీల్లో పరిశీలించనుంది. స్వాతంత్ర్యం రావడానికి పూర్వమే కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ పాత్రకు అనకాపల్లి వర్తక సంఘం శ్రీకారం చుట్టింది. ఉత్తరాంధ్ర వాసుల కోసం వైద్య, విద్యా సంస్థలను ప్రారంభించింది. అందులో భాగంగా అనకాపల్లి ఏఎంఎఎల్ కళాశాలను నెలకొల్పింది. అతి సాధారణమైన ఫీజులతో నాణ్యమైన విద్యను అందించింది. ఇందు కోసం కళాశాలకు అనకాపల్లి వర్తక సంఘం ప్రతి ఏడాది కోట్లాది రూపాయలను వెచ్చిస్తూనే ఉంది. సువిశాల ప్రదేశంలో దాదాపుగా విశ్వవిద్యాలయం స్థాయిలో ఉండే అన్ని సౌకర్యాలను అందిస్తోంది. నేటి కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల పోటీలను కూడా తట్టుకొని నిలబడింది. సుమారు లక్ష మందికి విద్యా బోధన చేసి సమాజంలో ఉన్నత స్థాయికి తీసుకువెళ్లడానికి కృషి చేసింది. ఇక్కడ చదివిన ఎంతోమంది పూర్వ విద్యార్థులు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఎఎస్, ఐపీఎస్, సైంటిస్టులు, హైకోర్టు జడ్జీలతో పాటు అన్ని రంగాల్లో ఉన్నతంగా స్థిరపడ్డారు.

ఇలా ఎందరినో ఉన్నతులుగా తీర్చిదిద్దిన ఎఎంఎఎల్ కళాశాలను ఈ నెల 18, 19 తేదీలలో జాతీయ స్థాయి నాక్ అక్రిడిటేషన్ గుర్తింపు కమిటీ పరిశీలించనుంది. వారు ప్రస్తుతం ఉన్న మౌలిక సదుపాయాలు, వసతులతో పాటు కళాశాలలో ఇంత వరకూ చదివిన పూర్వ విద్యార్థుల ఉన్నతిని కూడా ప్రత్యక్షంగా తెలుసుకుంటారు. వారు కళాశాల కార్యక్రమాల్లో పూర్వ విద్యార్థుల పాత్రను పరిశీలిస్తారు. ఇందుకోసం ప్రత్యేకంగా 40 మార్కులను కేటాయిస్తారు. కళాశాల పూర్వ విద్యార్థులు అన్ని రంగాల్లో బాగా రాణిస్తే, కళాశాలలో వారి పాత్ర పట్ల సంతృప్తి వ్యక్తమైతే ఈ 40 మార్కులు వస్తాయి. కమిటీ వారి షెడ్యూల్లో భాగంగా పూర్వ విద్యార్థుల సంఘానికి 18న మధ్యాహ్నం రెండు గంటలకు సమయాన్ని కేటాయించారు. ఆ సమావేశంలో పూర్వ విద్యార్థులంతా పాల్గొని ఇంగ్లీషు, హిందీ భాషల్లో వారికి మన విలువైన సమాచారం తెలియజేయాల్సి ఉందని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు బొడ్డేడ అప్పారావు, పెనుమత్స కృష్ణంరాజు తెలిపారు. కళాశాలకు హాజరుకానున్న ఇతర ప్రాంతాల వారందరికీ భోజన సౌకర్యాలను కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఎఎంఎఎల్ కళాశాల ఫిజిక్స్ డిపార్టుమెంట్

18 నుంచి జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు

సమావేశంలో పాల్గొన్న జనసేన కశింకోట మండల నాయకులు

ప్రజాశక్తి -కశింకోట

ఈ నెల 18 నుండి 28 వరకు 10 రోజుల పాటు జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతున్నామని, దానిని జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. కశింకోట మండలం తాళ్లపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నాయకులు మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గం నుంచి 50 మంది వాలంటీర్లతో నమోదు ప్రక్రియ చేపట్టనున్నట్లు చెప్పారు. పార్టీ కోసం పనిచేసే జనసేన కార్యకర్తల భద్రత పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ బాధ్యత అని పేర్కొన్నారు. జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం ద్వారా వివిధ ప్రమాదాల్లో మరణించిన వారి కుటుంబాలకు రూ.5 లక్షలు చొప్పున గత మూడు సంవత్సరాల నుంచి అందించడం జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు కర్రి వెంకట సత్యనారాయణ, కలిగేట్ల సింహాద్రి, ఐయనాల నాయుడు, మజ్జి నాయుడు, కర్రి లోవరాజు పాల్గొన్నారు.

అనకాపల్లి : స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం అనకాపల్లి నియోజకవర్గ స్థాయిలో నాలుగో విడత జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. అనకాపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదుపై కార్యచరణ, రాబోవు 18వ తారీకు నుండి జరగబోవు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటీసీ సభ్యులు భరత్ బాబు, తుమ్మపాల ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, కర్రి సత్యనారాయణ, బుదిరెడ్డి మోహన్, బంటు రవి, శ్రీరామదాసు గోవింద్, తాడి రామకృష్ణ , మల్ల శ్రీను, దూలం గోపి, మంగా ఈశ్వర్, బర్నికాన రాము, అప్పికొండ గణేష్, ఆళ్ల రామచంద్రరావు, పీలా నాగ శ్రీను, కోట్నిసూరిబాబు, గల్లా కొండలరావు , సత్యం దొర, విల్లూరు హరి, బుద్ద రాందాస్, పాల్గొన్నారు.



నాయకులను సత్కరిస్తున్న నిర్వాహకులు

మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి -పరవాడ

పరవాడలో శ్రీవెంకటేశ్వర మెడికల్ డాక్టర్స్ ప్లాజా ఆధ్వర్యాన ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని మాజీ జెడ్పిటిసి పైల జగన్నాధరావు, టిడిపి నాయకులు కొన్నూరు వెంకటరమణ, పి.బోనింగి మాజీ సర్పంచ్ రాయవరపు దేవుడు ప్రారంభించారు. సుమారుగా 300 మందికి పైగా రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన శ్రీ వెంకటేశ్వర మెడికల్ డాక్టర్ ప్లాజా యాజమాన్యాన్ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఈమని రమణమూర్తి, చిటికెల రమేష్ బాబు, పదిమంది డాక్టర్ల బృందం పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు

తెలుగుదేశం కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. ఆదివారం కె.కోటపాడులో మండల సిపిఐ కార్యదర్శి గొర్లె దేవుడు బాబు అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి పార్టీలు అనేక హామీలు ప్రకటించి విజయం సాధించాయని, ఆ హామీలన్నీ తూచా తప్పకుండా అమలు చేయాలని కోరారు. మండలంలో పాతవలస నుండి సూదివలస రోడ్డుకు గతంలో నిధులు మంజూరయ్యాయని, దానిని తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రైతు సమస్యలపై రైతులను చైతన్యపరచడానికి జిల్లా వ్యాప్తంగా మూడు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఆగస్టు 6న నర్సీపట్నంలో సిపిఐ జిల్లా జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేశామని, దీనికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు, నాయకులు వేచలపు కాసుబాబు, రెడ్డి అప్పలనాయుడు, సీమసిరి సూర్యనారాయణ, చప్పా కోటి, సీమసిరి రామనాయుడు, పొంతపల్లి రామారావు, దమ్ము ముత్యాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దొరబాబు

జగన్నాథస్వామిని దర్శించుకున్న నాగజగదీష్

ప్రజాశక్తి -అనకాపల్లి

అనకాపల్లి పట్టణంలోని ఇంద్రజ్యొమ్ము హాలులో కొలువుదీరిన జగన్నాథస్వామిని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగ జగదీష్ ఆదివారం దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, ధర్మకర్తల మండలి స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించి తీర్థ ప్రసాదం ఇచ్చి దుస్సాలువ వేసి షీల్డ్‌తో జగదీష్ ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బొడ్డేడ మురళి, బుద్ద లక్ష్మీ, అప్పారావు, కుప్పిలి జగన్, కర్రి గోపి, మళ్ళ శివన్నారాయణ, బోడి వెంకట్రావు, సారిపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న టిడిపి నేత నాగజగదీష్

అసంపూర్తిగా అంగన్వాడీ కేంద్రాలు

- అద్దె భవనాల్లో కాలాన్ని వెలదీస్తున్న వైనం - అవస్థలు పడుతున్న చిన్నారులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలో పలు అంగన్వాడి కేంద్రాలకు సొంత భవనాలు లేక చిన్నారులు, కార్యకర్తలు పలు అవస్థలు పడుతున్నారు. మండలంలో 11 అంగన్వాడీ భవనాలు 10 సంవత్సరాలుగా పనులు పూర్తి కాక అసంపూర్తిగా మిగిలి ఉన్నాయి. గత ప్రభుత్వంలో మంజూరైన నాడు నేడు నిధులతో మరో రెండు అంగన్వాడీ కేంద్రాలు నిర్మాణ దశలో ఉన్నాయి. అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఏర్పాటు చేసేందుకు అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం స్థలాలు తో పాటు నిధులు మంజూరు చేసింది. ఆ నిధుల తో భవనాలు పనులు ప్రారంభ దశకు చేరుకున్నాయి. ఇంతలో ప్రభుత్వం మార్పు చెందడంతో నిర్మాణాలకు సంబంధించినంత వరకు చెల్లింపులు చేయక పోవడంతో భవనాల పనులు పూర్తిగా నిలిచి పోయాయి. అప్పటి నుంచి కొంగసింగి, ఎఎల్ పురం 2, చోద్యం, విప్పలపాలెం, గాధంపాలెం, పేటమాలపల్లి, సిహెచ్ నాగాపురం, గైరంపేట, రామచంద్రపురం, నిమ్మగెడ్డ, కోదులపాలెం, వడపర్తి, జమ్మవరం గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లోనే నిర్వహణ కొనసాగుతుంది. అద్దె భవనాలు కావడంతో పూర్తి స్థాయిలో చిన్నారులకు సౌకర్యాలు లేక అటు కార్యకర్తలు, ఇటు చిన్నారులు అవస్థలు పడుతున్నారు. కొన్నిచోట్ల కృత్యాధార బోధనకు అద్దె భవనాలు అనుకూలంగా లేక కార్యకర్తలు ఉన్న ప్రదేశంలోనే చిన్నారులకు నేర్పేందుకు అవస్థలు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వంలో మండలంలో గైరంపేట, ఎఎల్ పురం2 కేంద్రాలకు నిధులు నాడు నేడులో కేటాయించారు. గైరంపేట కేంద్రం దాదాపు నిర్మాణం పూర్తి చేసుకుని చివరి దశకు చేరుకుంది. ఏఎల్ పురం 2 కేంద్రం ప్రస్తుతం స్లాబ్ దశకు చేరుకుంది. మిగిలిన 11 గ్రామాల్లోనూ అంగన్వాడీ కేంద్రాల నిర్మాణ పనులు నిలిచాయి. ప్రస్తుత ప్రభుత్వం అసంపూర్తిగా మిగిలిన ఉన్న అంగన్వాడీ భవనాలు పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు వస్తే చిన్నారులకు మెరుగైన సదుపాయాలు అందించి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు అవకాశం ఉంటుంది. నిర్మాణాలు పూర్తయితే ఈ 11 కేంద్రాలకు అద్దె భారం తగ్గి ప్రభుత్వానికి ఆర్థిక భారం తగ్గుతుంది. దీనిపై ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించి నిలిచిన అంగన్వాడి నిర్మాణాలను చేపట్టాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.

ఎఎల్.పురం 2లో నిలిచిన అంగన్‌వాడీ భవనం

చోద్యంలో నిలిచిన అంగన్‌వాడీ భవనం

భవనాలపై నివేదిక సిద్ధం

ఇటీవల మండలంలో నిర్మాణంలో నిలిచిన భవనాల వివరాలను ఉన్నతాధికారులు సేకరించమని ఆదేశించారు. వివరాలు సేకరించి నివేదిక సిద్ధం చేసి ఉంచాం. అధికారుల ఆదేశించిన వెంటనే నివేదికను పంపించడం జరుగు తుంది.

శ్రీగౌరి,
ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి

భోజనాలు అందిస్తున్న టిడిపి నేత వెంకటేష్

రోగులకు భోజనాలు పున: ప్రారంభం

ప్రజాశక్తి-నక్కపల్లి:నక్కపల్లి 50 పడకల ఆసుపత్రిలో హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు రోగులకు భోజనాలు పున్న ప్రారంభించినట్లు తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ తెలిపారు. ఆసుపత్రిలో రోగులకు ఆదివారం భోజనాలను అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం హయాంలో కాంట్రాక్టర్ కు భోజనాల బిల్లులు చెల్లించకపోవడంతో 5 నెలల నుంచి రోగులకు ఇచ్చే భోజనాలను నిలుపుదల చేశారని తెలిపారు. ఈ విషయం హోం మంత్రి అనిత దృష్టికి తీసుకు రావడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి భోజనాలు పున్న ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఈశ్వర్ ప్రసాద్, అనూష ,స్టాఫ్ స్వాతి, సుమ, శ్రీదేవి,ఆర్యవైశ్య సంఘం ప్రతినిధి కక్కిరాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పనులు ప్రారంభిస్తున్న నాయకులు

బోరు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని వెదుళ్లపాలెంలో ఆదివారం జెడ్పిటిసి నిధులతో బోర్ వెల్ ఏర్పాటుకు సర్పంచ్ వెదుళ్ల వరలక్ష్మి, స్థానిక నాయకులు శంకుస్థాపన చేసారు. స్థానిక అంగన్వాడీ కేంద్రం వద్ద చేతి బోరు ఏర్పాటుకు బోర్ వెల్ తవ్వించారు. ఈ కార్యక్రమంలోఉప సర్పంచ్ దేశెట్టి జయలక్ష్మి, సర్పంచ్ భర్త వెదుళ్ళ వెంకటరమణ, మాజీ సర్పంచ్ వెదుళ్ళ పాపారావు, స్థానిక నాయకులు దేశెట్టి రమేష్, దేశెట్టి భాస్కరావు, బండి బాబురావు, వెదుళ్ళ బాబురావు, కరణం వెంకట సత్యం, అంగన్వాడీ టీచర్ బండారు సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

డ్రైయినేజ్ పనులు చేపడుతున్న యువకులు

శ్రమదానంతో డ్రైనేజీ పనులు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని కొమిర గ్రామంలో తెలుగుదేశం పార్టీకి చెందిన యువకులు ఆదివారం శ్రమదానం చేశారు. గ్రామంలో డ్రైయినేజీలో పూడిక పెరిగి పోయింది. దీంతో, తెలుగుదేశం పార్టీకి చెందిన యువకులంతా ముందుకు వచ్చి మండలం యూత్ అధ్యక్షులు కర్రి నాయుడు ఆధ్వర్యంలో శ్రమదానంతో పూడికలు తొలగించారు. యువకులు ముందుకు వచ్చి శ్రమదానం చేయడంతో గ్రామస్తులు అభినందించారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండలంలోని కరిముఖి పుట్ పంచాయతీ కేంద్రంలోని ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక సర్పంచ్ భర్త గల్లెల అర్జున్ ఆధ్వర్యంలో ఘనంగా చేపట్టారు. ఉద్యోగులు ముఖి బలరాం, ముఖి నరసింహ మూర్తిలను కరిముఖిపుట్ గ్రామ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు సన్మానం చేశారు. వివిధ గ్రామాల నుంచి బంధు మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొని ఇద్దరు ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఉద్యోగుల సేవలను కొనియాడారు.

అయ్యన్నపాలెంలో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఉపమాక పంచాయతీ శివారు అయ్యన్నపాలెంలో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురై ఎలమంచిలి సత్యవతికి చెందిన పూరిల్లు దగ్ధమైంది. దీంతో, ఇంట్లో సామగ్రి కాలి బూడిదయ్యింది.సర్పంచ్ ప్రగడ వీరబాబు, రెవెన్యూ అధికారులు, టిడిపి నాయకులు కొప్పిశెట్టి బుజ్జి, వార్డు మెంబర్ ఎలమంచిలి వెంకటేష్, కొప్పిశెట్టి వాసు తదితరులు దగ్ధమైన ఇల్లును పరిశీలించారు. ఇంట్లో సామగ్రి అంతా కాలిపోయిందని బాధితురాలు వాపోయింది. సుమారుగా 2 లక్ష 50 వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు రెవిన్యూ అధికారులు అంచనా వేశారు.

ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితురాలు

ప్రమాదభరితంగా రహదారి

ప్రజాశక్తి- అనంతగిరి రూరల్:మండలంలోని చిలకలగెడ్డ మొదలుకొని అరుకు వెళ్లె ఘాట్ రోడ్డు శిథిలావస్థకు చేరుకోవడంతో ఘాట్ రోడ్డులో ప్రయాణం ప్రమాదభరితంగా మారింది. గత మూడు రోజుల నుంచి కురిసిన భారీ వర్షానికి అరుకు రహదారి వర్షపు నీటితో నిండి పోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిలో వర్షాకాలంలో రాత్రి వేళ ప్రయాణం చేయాలంటే ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని రాకపోకలు సాగిస్తున్నారు.ఇదిలా ఉండగా వరద నీటి ప్రవాహానికి రోడ్డుకి ఇరువైపులా ఉన్న రక్షణ గోడలు కూలాయి. బీసుపురం- కాఫీ తోట, టైడా జంగిల్ బెల్స్ ప్రాంతాల్లో రోడ్డు కోత కు గురైంది. ఓ వైపు హైవే నిర్మాణం జరుగుతుండటంతో ఎక్కడ పడితే అక్కడ గుంతలు చేస్తున్నారు. దీంతో, రహదారి మార్గం బురదమయంగా మారుతుంది.దీంతో, వాహనదారులు పలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి ఘాట్ రోడ్‌లో ప్రమాదాలను అరికట్టాలని పలువురు వాహనదారులు, పలు ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.

వర్షాలకు దెబ్బతిన్న రోడ్డు

చిత్రాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

ఐ యామ్ కలాం చిత్ర ప్రదర్శన

ప్రజాశక్తి-పాడేరు: ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఆదివారం ఐ యామ్ కలాం చలనచిత్రాన్ని ప్రదర్శించారు. విద్యార్థులకు విజ్ఞానాన్ని, వినోదాన్ని అందించే విధంగా చలనచిత్రాలను ఆశ్రమ పాఠశాలలో ప్రదర్శించి విద్యార్థులకు మాత్రమే వినోదాత్మకమైన చిత్రాలను ప్రదర్శిస్తున్నారు. ఆదివారం శ్రీకృష్ణాపురం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఐ యామ్ కలాం చలన చిత్రం ప్రదర్శించారు. విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. సెలవు రోజులలో విద్యార్థులు ఇళ్లకు వెళ్లకుండా ఐటీడీఏ అధికారులు ప్రయోగాత్మకంగా విజ్ఞానాన్ని అందించే విధంగా చలనచిత్రాలను ప్రదర్శిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న అప్పలరాజు

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజ్యపేటకు చెందిన పిక్కి ఏడుకొండలు కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు కోరారు. ఆదివారం ఏడుకొండలు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, పిక్కి ఏడుకొండలు ఆవులను మేపుకుంటూ, పాడితో వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఇటీవల 4 ఆవులు మృత్యువాత పడ్డాయన్నారు. దీంతో ఏడుకొండలుకు 2 లక్షల 50 వేల వరకు నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆవుల మృతితో కుటుంబం రోడ్డు పడిందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు .ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం. రాజేష్, రాజయ్యపేట శాఖ కార్యదర్శి మైలపల్లి మహేష్, బొంది నూకరాజు, బొందలవు అప్పలరాజు, మైలపల్లి జాను, పిక్కి దావీద్రాజు, మైలపల్లి అప్పలరాజు, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి కార్యకర్త ఫిర్యాదు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:టిడిపి కార్యకర్త, టైర్ల షాప్ నాయుడు తనపై దాడి చేశారంటూ నర్సీపట్నం పెద్ద చెరువు వద్ద లారీ ట్రాన్స్‌పోర్టు ఆఫీస్‌లో పనిచేస్తున్న వైసిపి కార్యకర్త జి.నాగేశ్వరరావు ఆదివారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కావాలనే కక్షపూరితంగా తనపై బెల్ట్‌తో దాడి చేసి గాయపర్చారని నాగేశ్వరరావు తెలిపాడు. దీనిపై విచారణ చేసి నాయుడుపై తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

17న ఏకాదశి ఉత్సవాలు

ప్రజాశక్తి-రోలుగుంట:స్థానిక కొండపైన వెలిసిన వేంకటేశ్వర దేవాలయంలో ఈ నెల 17న శయన ఏకాదశి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయంలో ఉదయం 6 గంటలకు పంచామృతాభిషేకాలు, పూజలు చేస్తారన్నారు. అనంతరం 108 కలశాలతో అభిషేకాలు చేసి, హోమం నిర్వహిస్తామని అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు, చిట్టిమాచార్యులు తెలిపారు. అభిషేకాలకు భక్తులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

అండగా ఉంటాం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:హిమోఫీలియా బాధితులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ తెలిపారు. సొసైటి విశాఖ పట్నం ఆధ్వర్యంలో ఆదివారం రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ పక్కన ఉన్న" స్టే ఇన్ గెస్ట్ హౌస్" లో 125 మంది హిమోఫీలియా పేషంట్స్ కు ఇంటాస్ ఫౌండేషన్ వారు ఉచిత ఇంజెక్షన్ లు పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి దుర్గా ప్రశాంతి అతిథిగా పాల్గొన్నారు. సొసైటి ప్రెసిడెంట్ డాక్టర్ చంద్రశేఖరం మాట్లాడుతూ హిమోఫీలియా ఒక జన్యు పరమైన రక్త సంబంధ డిజార్డర్ అని, గాయం నుంచి రక్తం గట్టకట్టటానికి ఎక్కువ సమయం తీసుకుంటుందని, ఇప్పుడు పంపిణీ చేస్తున్న వేలాది రూపాయల ఖరీదైన ఇంజెక్షన్ మాత్రమే తాత్కాలిక ఉపశమనం అని వివరించారు.అనంతరం బాధితుల తరపున ఒక వినతి పత్రంను ఎమ్మెల్యేకు అందజేశారు.కెజిహెచ్ లో ప్రత్యేక వార్డ్,అర్హులైన పేషంట్స్ కి అనవసర మైన నిబంధనలు లేకుండా పెన్షన్ మంజూరు, పేషంట్స్ కి వికలాంగుల సర్టిఫికెట్, హిమోఫీలియా రక్త పరీక్షలు కోసం లాబరేటరీ ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వర రావు, సాయిబాబా,మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల విజేతలకు ట్రోఫీలు

ప్రజాశక్తి-కలెక్టరేట్:దక్షిణ నియోజకవర్గంలోని ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన క్రికెట్ పోటీలలో ప్రథమ, ద్వితీయ స్థానాలను పొందిన జట్లకు ఆదివారం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ట్రోఫీలు అందజేశారు. శ్రీ మరిడిమాంబ అమ్మవారి పండుగ మహోత్సవం సందర్భంగా 31 వ వార్డు కనకల వీధి మరిడిమాంబ వాంబే కాలనీ, మరిడిమాంబ వినాయక యూత్ ఆధ్వర్యంలో మరిడిమాంబ ప్రీమియర్ లీగ్ సీజన్ వన్ క్రికెట్ ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించారు. అందులో విజేతలుగా మరిడిమాంబ వారియర్స్ గెలిచారు. రన్నర్స్ గా మరిడిమాంబ లెవెల్స్ విజేతలకు దక్షిణ నియోజకవర్గం కూటమి శాసనసభ్యులు చేతుల మీదగా ట్రోఫీలు బహుకరించారు.

ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

కల్కిని వీక్షించిన అనాథ పిల్లలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: వారంతా అనాథ పిల్లలు. రోజూ తరగతి గదిలో పాఠాలు చదువుకుంటారు.ఇక ఆదివారం వస్తే ఆటవిడుపు ఆటలు, పాటలతో కాలక్షేపం అవుతుంది. కానీ, ఒక స్వచ్ఛంద సంస్థ ముందుకు రావడంతో వందలాది మంది అనాథ పిల్లలకు ఉచిత సినిమా ప్రదర్శన జరిగింది. జెసిఐ (జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్) వైజాగ్ పోర్ట్ అమిగోస్ ఆధ్వర్యంలో 120 మంది అనాథలకు ఉచిత చలనచిత్ర ప్రదర్శనకు తీసుకువెళ్లింది. ప్రభాస్,దీపిక పదుకొనె, అమితాబ్ బచ్చన్ ముఖ్యపాత్రలో నటించిన కల్కి సినిమాను విశాఖ నగరంలోని జగదాంబ కాంప్లెక్స్, రామా రాకేష్ థియేటర్లలో ఆదివారం ఈ సినిమా ప్రదర్శించారు. కాగా, పిల్లలు ఈ సినిమా చూసేందుకు ఉత్సాహం చూపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నగర పోలీస్ కమిషనర్ హాజరై పిల్లలతో ముచ్చటించారు. అనంతరం కొంతసేపు పిల్లలతో చిత్రాన్ని వీక్షించారు.అనంతరం జెసిఐ సభ్యులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అనాథలకు ఆహ్లాదకరమైన విద్య, వినోద అనుభవాన్ని అందించడానికి జెసిఐ వైజాగ్ పోర్ట్ అమిగోస్ కార్యక్రమాన్ని నిర్వహించిందని, పిల్లలు ఈ సినిమా నుంచి విలువైన పాఠాలను నేర్చుకోగలరని,వారు తమ జీవితాలను చిత్తశుద్ధి, కరుణతో జీవించడానికి ప్రేరణ పొందాలని సంస్థ భావించడం గొప్ప విషయం అన్నారు.జెసిఐ ప్రెసిడెంట్ భార్గవ్ మహర్షి మాట్లాడుతూ గత 4 ఏళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సంతోష్ కుమార్,పూర్వ అధ్యక్షులు మాధురి సామినేని, చంద్ర మౌళి,సాయివర్మ పాల్గొన్నారు

చిన్నారులతో జెసిఐ సభ్యులు

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:దక్షిణ నియోజకవర్గం 34 వ వార్డు భూపేష్ నగర్‌లో నివాసం ఉంటున్న జంపా అప్పారావు అనే పేద వ్యక్తి మరణించగా, అతని కుటుంబానికి నియోజకవర్గ జనసేన సీనియర్ నాయకులు డాక్టర్ కందుల నాగరాజు ఆదివారం తన కార్యాలయంలో కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ నియోజక వర్గంలో కుల మతాలకు అతీతంగా, ప్రజలందరి కష్ట సుఖాల్లో పాలు పంచుకుంటు న్నామన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన యువ నాయకులు కందుల కేదార్ నాథ్, కందుల బదరీ నాథ్,34 వ వార్డు జనసేన నాయకులు నీలం రాజు, శ్రీనివాస్, మృతుని కుటుంబ సభ్యులు రాణి,శాంతి, జగదీశ్వరి,మణి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చింతపల్లి : మండలంలోని చింతపల్లి మండలంలోని లంబసింగి పంచాయతీ చినరాజు పాకల గ్రామంలో జంగిల్ క్లియరెన్స్ చేస్తుండగా విద్యుత్ షాక్ కు గురై రాజుబాబు అనే యువకుడు మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటనలతో ఆ కుటుంబాలు నిరాశ్రయులుగా మిగిలారు. విద్యుత్ పనులు చేసేటప్పుడు ఆ శాఖ అధికారులు కనీస జాగ్రత్తలు పాటించక పోవడంతో తరచూ ఇటువంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పలువురు గిరిజనులు, పలు సంఘాల నేతలు తెలిపారు.అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రామాల్లో చదువుకునేందుకు

గిరిజన విద్యార్థుల అవస్థలు

ప్రజాశక్తి - అనంతగిరి:మండలంలోని గిరిజన గ్రామాల్లో పాఠశాలల భవనాలు లేక చెట్లు, పాకల కింద చదువుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వాలు మారుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. గత వైసిపి ప్రభుత్వం నాడు నేడు పథకంతో పాఠశాలల రూపు రేఖలు మార్చిన దాఖలాలు లేవు. మరీ నూతన ప్రభుత్వమైనా పాఠశాలల భవనాల నిర్మాణంపై దృష్టి పెడుతుందో లేదో అని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని వెంగడ పంచాయతీ డొంకపుట్టు ఎంపిపి ప్రాథమిక పాఠశాల పదేళ్ల నుండి మొండిగోడతో నిలిచి పోయింది. రెండు ఏళ్ళ కిందట ఐటిడిఎ నిదులతో పనులు చేపట్టి వదిలి వేశారు. ఈ పాఠశాలలో ఐదు గ్రామల విద్యార్థులు 55 మంది చదువుతున్నారు. వీరంతా పూరి పాకలో చదువుతున్నారు.బందవలసకు పాఠశాల నేటికి మంజూరు కాలేదు. మట్టి గోడ గదిలో 15 మంది విద్యార్థులు చదువుతున్నారు. వాలసి పంచాయతీ పరిధి ఊటగెడ్డ పాఠశాల మొండి గోడలతో నిలిచిపోయింది. ఇంటి ఆరు బయట చదువులు కొనసాగుతున్నాయి. పది మంది విద్యార్థులు ఉన్నారు. పైనంపాడు పంచాయతి కాకరపాడు పాఠశాల మొండి గోడలతో నిలిచింది. ఇక్కడా 36 మంది విద్యార్థులు పాకలో చదువులు సాగిస్తున్నారు.

వాలసి పంచాయతీ రాయిపాడులో పదేళ్ళ క్రితం పునాదులు తవ్వి వదిలి వేశారు. ఐదు గ్రామాలకు చెందిన 40 మంది పైగా విద్యార్థులు చిన్నపాటి వంటగదిలో చదువులు కొనసాగిస్తున్నారు. లుంగపర్తి పంచాయతీ ఒనుకొండ గ్రామంలో నేటికి పాఠశాల మంజూరు కాలేదు. 20 మంది పైగా విద్యార్థులు ఇంటి అరుబయట చదువుతున్నారు. రొంపల్లి పంచాయతీ పరిధి బూరిగా గ్రామంలో మొండి గోడలతో పాఠశాల పనులు నిలిచిపోయాయి. 30 మందికి పైగా ఉన్నారు. వర్షాకాలంలో ఇంటి ఆరు బయట, ఎండాకాలం చెట్టు కింద చదువుతున్నారు. కివర్ల పంచాయతీ బుడ్డిగరువులో 30 మందిపైగా పివిటిజి విద్యార్థులు ఇంటి అరుబయట చదువుతున్నారు. నాడు నేడు నిధులు మంజూరుతో పునాది బేస్ మెంట్ పనులు చేపట్టారు. పూతికపుట్టు పాఠశాలలో నాడు నేడు నిధులు మంజూరు అయ్యాయి. పునాదులు తవ్వి వదిలివేశారు.చందాలు వేసుకుని పాకలను ఏర్పాటు చేసుకున్నారు. నూతన ప్రభుత్వం పాఠశాలల ఏర్పాటుకు కృషి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు.

బూరిగలో చెట్టు కింద చదువుతున్న విద్యార్థులు

ఊటగెడ్డలో ఇంటి ఆవరణలో చదువుతున్న విద్యార్థులు